# శ్రీ శివజ్యోతి

రచయిత:

ఆర్షవిద్యాలంకార;

కల్లూరి చంద్రమౌళి బి. యసి. (యడింబరో)

మాజీ మంత్రివర్యులు

అధ్యక్షులు, శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము (తిరుపతి)

శ్రీ సీతారామచంద్రమూర్తి దేవస్థానము (భద్రాచలం)

ప్రథమ ముద్రణము
1983, ఆగష్టు

మూల్యము రూ॥ 20-00

దొరకు స్థలము
మరియు
ముదిగొండ విశ్వనాథము
అజంతా పబ్లిషింగ్ హౌస్
అరండల్ పేట : : గుంటూరు-2.

జూపిటర్ ప్రింటింగ్ ప్రెస్, అరండల్ పేట 7వ లైను గుంటూరు-2,
ఫోన్ నెం. 31904.

# ఆమోదము

ఆర్షవిద్యాలంకారులు, సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, మాజీఅమాత్యవర్యులు, రామాయణతత్త్వవేత్తలు, భద్రాచలసీతారామాలయ ఉద్ధరణకై మిక్కిలి కృషిచేసిన "అపర రామదాసు"లు, విశిష్టాద్వైతతత్త్వవిశారదులు, పరమపావనులు శ్రీకల్లూరిచంద్రమౌళి గారు వీరవైష్ణవులైనప్పటికిని, వారు అగస్త్యునివలె శివాద్వైతాన్ని, ఔపాసనపట్టిన మహానుభావులు.

వారు ఈ "శ్రీశివజ్యోతి" గ్రంథములో శైవాన్ని పరామర్శిస్తూ చారిత్రకంగ వివరిస్తూ, ఆర్షసాంప్రదాయ ప్రకారము "సత్యం - శివం సుందరం" స్వరూపుడైన "శివం" వివరించారు శ్రీచంద్రమౌళిగారు. "నీలకంఠ-శంకర-రామానుజ" ఆచార్యుల గీతాభాష్యరహస్యములను మథించి, ప్రస్థాన సాంప్రదాయము - పురాణ సాంప్రదాయముల ననుసరించి శివుని వివరించిరి.

వరంగల్లు శివశ్రీ శంకరారాధ్యులవారు "శివుని గోరువారు నిత్యులై యుందురు" అనినట్లు "శివోపాసన"ను వివరించిరి. "కర్మశుద్ధి-మనస్సుద్ధి - భావనాశుద్ధి" మొదలగు విషయముల వివరించి "శివోపాసన" ప్రాశస్త్యము తెలుపబడినది.

"చిత్తశుద్ధిలేని శివపూజలేలరా" అని వేమన చెప్పిన వాక్యమును జ్ఞప్తికి తెచ్చుచు, "శివపూజ" ఆత్మానుసంధానమనుట సమంజసము.

"శుష్కజ్ఞానమని నిరర్థకమని, భక్తిపూరిత శరణాగతి ముఖ్యమని" తెలుపుచు శివశరణులను ప్రస్తుతించుట ముదావహము.

"శివుడు - జీవుడు - జగత్తు" అనువానితో గూడిన "శివాద్వైతము"ను "మహాశివరాత్రి మహాత్మ్యమును" "శివతాండవమును" వర్ణించు శివపారమ్యాన్ని శ్రీ చంద్రమౌళిగారు వివరించి శివభక్తుల శరణాగతిని వివరించారు.

ఆంధ్రదేశలో "గణార్చన" అను వ్రతము కార్తీకమాసములో శైవులచే ఆచరింపబడుచున్నది. పూర్వము బసవేశ్వరుడు "గణార్చనచేసి" భక్తులను "లింగైక్యానుసంధానుల"ను కావించాడు. అట్టి "గణార్చన"ను భక్తులకు క్లుప్తంగా వివరించిన శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు ధన్యులు.

కులపతి
కొంపల్లి ఆంజనేయశాస్త్రి ఎం. ఎ. ఎం. ఇడి.
విద్యాప్రవీణ, భాషాప్రవీణ, ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణా కళాశాల
వరంగల్లు

"శివాజ్ఞ"

శివశ్రీ ముదిగొండ రామలింగశాస్త్రి
(రిటైర్డ్ ఆంధ్రభాషోపన్యాసకులు)(శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్రకళాశాల వరంగల్లు)

"శ్రీశివజ్యోతి" అను గ్రంథము. ఆంధ్రదేశమునందలి శైవమత సాంప్రదాయముల పద్ధతులను విశదీకరించినది.

"శివశరణులు" పరమ మాహేశ్వరులు, గురుచరేశ్వరులు "గురుచరేశ్వర" పూజను శైవులు ముఖ్యముగ భావిస్తారు. అట్టి గురుచరేశ్వరారాధన "శైవగణార్చన"గ ప్రసిద్ధము. శైవగణార్చనను శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు సంగ్రహముగ వ్రాశారు. ఇది శైవులందరు గ్రహించి ఆచరించవలయును.

ఆరుమతములలో "శైవంచ......అని మొదటిదిగ పేర్కొనినారు. పురాణాదులలో ఎక్కువ శివపారమ్యాన్ని ప్రబోధించినవి. శ్రీ నీలకంఠాచార్యులవారి సిద్ధాంతమును వివరించినారు. "సదాశివునితో ప్రారంభమైన శైవాన్ని నీలకంఠాచార్యులవారు మధ్యలో ప్రచారముచేసి, ద్వాదశాచార్యుల, పండితత్రయి, ప్రభోదముచే మిక్కిలి ప్రభావితమైన, గురుపరంపరతో "నేడు అభివృద్ధినొందినది. శివ శ్రీ ముదిగొండ శంకరాచార్యులు, శివయోగి శ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రిగారు మొదలగువారు 19వ శతాబ్దిలో శతాధిక గ్రంథముల ప్రచురించి శైవప్రబోధము చేసినారు.

అర్షవిద్యాలంకార; "శ్రీకల్లూరి చంద్రమౌళిగారి గ్రంథము "శ్రీశివజ్యోతి" జ్యోతియై వెలుగొందును.

## ఓరుగంటి వేంకటరమణయ్య

భ్రమరాంబా మల్లికార్జునస్వామి దేవస్థానం (Ex)

మార్కాపురం

"శివజ్యోతి" మాన్యశ్రీ అర్షవిద్యాలంకార బిరుదాంకితులు కల్లూరి చంద్రమౌళిగారు వ్రాసిన గ్రంథమును పూర్తిగా తిలకించితిని. యిందలి విషయములోగడ వ్యాసరూపములుగా శ్రీశైల ప్రభలో ప్రచురింపబడినవే అనాడే మేము యెంతో వీటినిఒక గ్రంథముగా చేర్చి భక్తులకందింపచేయ తలంచితిమి అట్టిసదవకాశము యిప్పటికి శ్రీభ్రమరాంబా మల్లికార్జునులొనగూర్చారు. విషయమును గురించి విపులీకరించుటకు గ్రంథకర్తయే చెప్పుకొనియున్నారు. శ్రీచంద్రమౌళిగారు గురుతుల్యులు గొప్ప సాహితీవేత్త వారిగ్రంథములు సరళశైలి. ప్రతిఒక్కరు తప్పక చదువ తగినది. దీనిని మేము దేవాలయ ప్రచురణగా చేయువలయునని ప్రయత్నము చేసినాము. ఫలించలేదు. యిందలి విషయములు అమూల్యములు. శ్రీచంద్రమౌళిగారి రచనలు ఆవశ్యకత యెల్లరకు తెలిసినదే. యీపుస్తకమును గూర్చి అభిప్రాయములందించిన మొదటివారు శివశ్రీ, కొంపల్లి ఆంజనేయశాస్త్రి శివశ్రీ మునిగొండ వాసలి గశాస్త్రిగార్లు విద్వల్లోకులు, జగమెరిగిన పండితులు వారికర్తాత నేనంతనే చెప్పగలను, ప్రతిఒక్కరు ఈగ్రంథాన్ని చదివి విషయము తెలిసికొని ఇందలి తత్వములో ప్రోత్సహించగలరని ఆశిస్తున్నాను.

# పీఠిక

"రామాయణసుధ" మున్నగు నాచే రచింపబడిన గ్రంథములను చూచిన మా మిత్రులు శైవమతపరమైన విషయముల గూర్చి గ్రంథస్థము చేయుట మంచిదని సూచించారు. అట్టి సజ్జనుల సూచనల ప్రకారము "మహాశివరాత్రి" వంటి కొన్ని వ్యాసములను వివిధ పత్రికలలో ప్రచురించుట జరిగినది. అట్టి వ్యాసరచనలలో నాకు తోడ్పడిన ప్రముఖ గ్రంథముల సహాయమున శైవమతము అందులో కూడ ఆంధ్రదేశమున ప్రచలితమైన శైవసాంప్రదాయిక విషయములను గ్రంథస్థము చేయ సమకట్టినను సహృదయులైన పాఠకులు నా అభిప్రాయములతో ఏకీభవిస్తారని తలంచుచున్నాను.

జ్ఞాత్వా శివం శాంతి మత్యంతమేతి" అనునట్లు శాంతి స్వరూపుడు, శాంతేశ్వరుడైన శివుని గూర్చి తెలియుట పూజించుట అవసరము. అది అక్ష సాంప్రదాయము.

చారిత్రక పరిశోధకులు కీ॥ శే॥ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి వంటి పెద్దలు తెలిపిన కొన్ని చారిత్రికాంశములను మొదట వివరించితిని. అటులనే సాంప్రదాయ శైవముల క్లుప్తముగ తెలిపితిని.

"శివ యను రెండక్షరములు హరియించును పాతకముల" అను వాక్యమీ గ్రంథరచనములో నన్ను ప్రోత్సహించినది. అట్టి శివుడు సత్యస్వరూపుడు, అటులనే సుందరస్వరూపుడు. కాన "సత్యం-శివం-సుందరం" అని ప్రసిద్ధమైన నానుడి.

శివపూజను ఆంధ్రదేశములో "శివపూజ - శివార్చన - శివారాధన" అను పద్ధతులలో ఆచరించుచున్నారు. భగవంతునికంటె భాగవతులు గొప్పవారు అను విషయము "శివశరణులలో" వివరించనైనది.

శివాద్వైతమును నీలకంఠాచార్యులు; అద్వైతమును, శంకరాచార్యులు, విశిష్టాద్వైతమును, రామానుజాచార్యులు ప్రవచించిరి, అందువలన "శివాద్వైత"మును గూర్చి సంగ్రహముగ తెలిపితిని,

కర్ణాటకమున బసవేశ్వరుని తరువాత ఆంధ్రప్రాంతమున గురుచరేశ్వరపూజచాల ముఖ్యముగనున్నది. అట్టి గురుచరేశ్వరరూప పూజను శైవులు 'గణార్చన' అని అంటారు, ఇది కార్తికమాసమునందు ప్రశస్తముగ చేయబడుచున్నది, కొందరు శైవులు కార్తికమాస శివరాత్రిరోజున "సూన్యసింహాసము"ను స్థాపించి "శివయోగము"ను ప్రదర్శించుట ప్రస్తుతము అక్కడక్కడ జరుగుచున్నది। యోగశాస్త్రానుసారమగు "సూన్యసింహాసనము" అంతరించకుండ చూచుట ప్రజల కర్తవ్యము॥

శైవులకు శివరాత్రి చాలముఖ్యము, అందువలన శైవసాంప్రదాయకముగ 'మహాశివరాత్రి' వివరించబడినది.

శివుడు ఆనందస్వరూపుడు: అమృతేశ్వరుడు, మంగళకరుడు; లోకేశ్వరుడు; సర్వేశ్వరుడు; విశ్వేశ్వరుడు; అట్టి పరమశివుని "ఆనందతాండవము" ఆనందదాయకము, పతంజలి మహర్షి, కర్కోటకుడు అను సర్పరాజు శివుని ఆనంద తాండవమునుచూచి "శివానందము"ను పొందిరి। ఈ రోజులలో నటరాజ దర్శనము ఆనందదాయకము, ఆనందమే "పరబ్రహ్మస్వరూపము"

ఈ 'శ్రీ శివజ్యోతి' గ్రంథరచనకు ప్రోత్సహించిన మిత్రులకు నా కృతజ్ఞతలు।

ఇట్లు
కల్లూరి చంద్రమౌళి
'ఆర్షవిద్యాలంకార'

చంద్రమౌళినగర్
గుంటూరు

# శైవము

"శైవంచ వైష్ణవం చైవ సౌరం వైనాయకం తథా స్కాందంచ శక్తి (భక్తి) మార్గంచ షణ్మతా పరికీర్తితాః"

అనుసట్లూరుస్మృతములలో శైవము మొదటిది, ప్రాచీనమైనది.

"ఈజిప్టు ప్రాంతములో" మేఫిస్'' మరియు అపీరిస్'' అను ప్రాంతములందు ''నందివాహనారూఢుడు",— త్రిశూలహస్తుడు — వ్యాఘ్రచర్మాంబరధారి" అగు శివునివిగ్రహములున్నవి, అచట ప్రజలు పాలతో; అభిషేకము చేయుచున్నారు, అట్లులనే మారేడు పత్రితో పూజచేయుచున్నారు,..................

..........'' బాబిలోన్ " పట్టణములో చాల ఎత్తుగల శివ లింగమున్నది,''......మహమ్మదీయుల యాత్రాస్థలమైన" మక్కా'' పట్టణములోనున్న శివలింగమును వారు ఖర్జూరపత్రముల''తో పూజింతురు,'

''శివమూల్యరత్నాకరము" అనే గ్రంథ ''పీఠిక" "యానాం" (Annam) అని పిలువబడు ప్రాచీన "చంపా" దేశములో అనేక శివాలయములున్నవి,"

పండిత కాశీనాథశాస్త్రి (మైసూరు)

'ఒకానొకప్పుడు యానాం' (చంపా) దేశమందలి 'మిసోన్ ఖేడా' అను పట్టణము కాశీకన్నను మించిన శివక్షేత్రముగ నుండెడిది.

శ్రీ సునీతకుమారచటర్జీ, *M. A; D - Lit*

"సృష్టం యేన త్రితయ మఖిలం భూర్భువః స్వః స్వశక్త్యా
యేనోత్థాతం భువన దురితం వహ్నినే వాంధకారం
యస్యాచింత్యా జగతి మహిమా యస్యనాదిర్న చాంత
శ్చం పాదేశే జనయతు సుఖం శంభుభద్రేశ్వరోయం"

మిసోన్ జోడాలో దొంకిన 4వ శిలాశాసన శ్లోకము. అదటి 32వ శిలాశాసనముద్వారా అచటి (శ్రీ) శానభద్రేశ్వరలింగము "ఉవన్" అను పర్వతముపై స్థాపించబడినది॥

"ఓం అవిఘ్నమస్తు, నమః శివాయ"
"యః నర్వస్సృజతి ప్రపాలయతి చాశేష్యం హరిష్యత్యఘః
దేవానాం జగతోపియః సుశరణో గౌరీపతిర్యా హరః
తం దేవం ప్రణమామి శూలిన మచింత్యం నీలకంఠం శివం
ఖొదేవేశమమ ప్రశాల్యతు మలం పాపంచ సర్వం సర్వదా'
"రాడేన్ మాస్ పొడ్జరకా' గారి గ్రంథ మంగళాచరణము"

"యత్ర యత్ర సయాతిస్మ .... రావణో రాక్షసేశ్వరః
జాంబూనదమయం లింగం తత్ర తత్ర స్వనీయతే
వాలుకావేది మధ్యేతు తల్లింగం స్థాప్య రావణః
అర్చయామాస గంధాద్యైః పుష్పైశ్చాగరు గంధిభిః

రామాయణం ఉత్తరకాండ 8। సర్గ 42-43 శ్లో॥

ఇట్లు ప్రాచ్య పాశ్చాత్య చారిత్రకులు ప్రాచీన మతములలో శైవము మిక్కిలి ప్రాచీనమని యంగీకరించిరి॥ 'సాతవాహనులు శివసంబంధమైన పేర్లు పెట్టుకొనుటవలన క్రీ॥ శ॥ 235 నుండి శైవసంప్రదాయమున్నట్లు తెలియుచున్నది, ఇక్ష్వాకువంశ రాజులు శ్రీపర్వతపతి మహాసేన పాదానుధ్యాతులు. ఇక్ష్వాకుల యిష్టదైవము స్కందుడు. ఇక్ష్వాకుల

కాలములో గూడ శివసంబంధమైన పేర్లుకలవు సాలంకాయన విష్ణు కుండి రాజులు వరకు భాగవతులు. అందులో విజయ దేవవర్మ తనను 'పరమ మాహేశ్వరుడు' అని చెప్పుకొనెను. అనగ శైవసాంప్రదాయ మంతకు పూర్వమునుండి పురికొని, రాజాశ్రయము సంపాదించినట్లు కనబడును. విష్ణుకుండిరాజులు "భగవత్ శ్రీ పర్వతస్వామి పాదాను ధ్యాతులు" అందులో విక్రమేంద్రవర్మ పౌత్రుడు, ఇంద్రవట్టారకవర్మ కుమారుడు, ఇమ్మడి విక్రమేందవర్మ మహారాజు' పరమమాహేశ్వరుడు ఇవడు దేవోవభోగముగ "రేగొండ" గ్రామమును దానముచేసినట్లు కలదు. ఈ దాన శాసనము శివుని పేర్కొన్న మొదటి శాసనము.

ఈరాజు క్రీ॥ శ॥ 540 నుండి 560 ప్రాంతమున పరిపాలించెనని చారిత్రికుల యభిప్రాయము। దీనివలన శైవము ప్రాచీనమని తెలియు చున్నది।

—శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

ప్రపంచ నాగరికతలలో సింధునాగరికత చాల ప్రాచీనమైనదని చారిత్రికులందరు నంగీకరించిరి,

"సింధులో యత్రవ్వకములలో చిన్నవి మరియు పెద్దవి లింగ ములు దొరికినవి, అందు చిన్నలింగములు "ధారణ"కు సంబంధించిన వై యుండును,"

-"సర్ జాన్ మార్షల్

ఈవిధముగ నాలోచించినచో పైన తెలిపిన ప్రకారము లింగ ధారులు "పాశుపతమహావ్రతులు" అని అందురు, లింగమును శరీర మందు సర్వదాధరించిన "ఇష్టలింగము" - అంతర్భావనామయమైన సూక్ష్మలింగము "ప్రాణలింగము" - పరాత్పరమగులింగము "భావ లింగము" అనియును ప్రవచింపబడుచున్నది,

పాశుపతవ్రతుడైన లింగధారి శుద్ధుడై కరపీఠమున లింగమును గంధపుష్పాదులతో నర్చింపవలయుననియును, పీఠార్చనముకన్న కరపీఠార్చనమే శ్రేష్ఠమని ప్రాచీనగ్రంథకారుల యభిప్రాయము,

అశేషక్లేశముక్తి కొరకు శాంకర లింగమును అంతర్భావన చేయవలయును, అనగ దహరమున నుపాసన చేయవలయును, అంతర్భావన చేయుటకు శక్తుడైనను కావున్నను అంతర్లింగరూపమే బాహ్యలింగరూపమను నిశ్చయముతో బాహ్యలింగధారణ ప్రతిపాదింపబడినది. "జ్ఞాత్వాంశివం శాంతి మత్యంతమేతి." అనువిధముగ శివుని తెలిసికొని మిక్కిలి శాంతినిపొందుట సులభము, ఈవిషయమును గ్రహించి బ్రహ్మాదిదేవతలు గౌతమాదిమహామునులు "లింగధారణ" చేసుకొని, "శాంభవదీక్షను గ్రహించి "పరమపాశుపతవ్రతదీక్షానిరతులై" శివునినుతించిరి.

కాన మన్మతములలో శైవము ప్రాచీనమైనది.
అనినిడువజెల్లును శివునివరమదైవముగ నమ్మి తత్సేవచే శివానుగ్రహపాత్రులై తద్ద్వారా తరింపగోరువారు శైవులు,

శైవమతము భారతదేశములో వివిధప్రాంతములందు వేరు వేరు రీతులలో గన్పట్టుచున్నది.

"కాశ్మీరమున గుప్తశైవము, గుజరాతున పాశుపత శైవము అరవదేశము (తమిళనాడు) నాయనార్ శైవము, కన్నడదేశమున లింగాయతశైవము, ఆంధ్రదేశములో ఆరాధ్యశైవము అనుభేదములు కనపడుచున్నవి, పై వానిలో లింగాయత+నాయనార్ శైవములలో వర్ణాశ్రమ ధర్మ సంబంధము లేదు. అటులే గుప్త+పాశుపత+నాయనార్ శైవముల లింగధారణ సంబంధము లేదు, పాశుపతశైవమున కొలదిగ వామాచార సంబంధము కన్పించుచున్నది, 1) "సామాన్య శైవము :- లింగధారణలేక, శివపారమ్యసుంగీకరించుదురు. అంతియేకాని శైవాచారములనన్నింటిని నమసరింపరు, 2) మిశ్రమశైవము:-

శివునితో బాటు దేవతలనందరిని పూజచేతురు. 3) శుద్ధశైవము :- ఇతర దేవోపాసన లేక కేవల శివారాధనమాత్రముగల శైవము శుద్ధ శైవము, 4, వీరశైవము :- శివునిదప్ప నన్య దైవతముల బూజింపరు లింగధారులై ఎట్టిపరిస్థితియందును శివోపాసన విడువరు. అని వాతూల మను శైవాగమములో తెలుపబడినది.

"చంద్ర జ్ఞానోత్తరములో శైవము ఎనిమిది విధములుగ వివరింపబడినది, 1) అనాదిశైవము :- శివుడు మరియు అతని పరిచరులు దీనికి చెందినవారు, 2) ఆదిశైవము :- అత్రిమరియు గౌతమాది మహర్షులు మరియు తత్సంతతివారు లింగధారులై పరమేశ్వర సంబంధములగు ప్రతిష్ఠాదులలోను, ఆచార్యపదవులలోను నధికృతులైనవారు. 3) పూర్వశైవము :- శివద్విజులు వీరికి దీక్ష - ధారణములు లేవు స్వార్థ మరియు పరార్థ యజనమునందు పూర్వశైవులకు అధికారము కలదు, అర్చకులుగ వీరున్నారు, 4) మిశ్రమశైవము :- ధారణ లేక స్మార్తకర్మ సంబంధము కలవారువీరు, 5) శుద్ధశైవము :- దేవతాంతర సంబంధము లేనివారు, 6) మార్గశైవము :- మోక్షప్రధానమగు సంప్రదాయము, 7) సామాన్యశైవము :- లింగధారణ లేక భస్మరుద్రాక్ష ధారణము మాత్రమే కలవారు. 8) వీరశైవము :- పట్టిన వ్రతములను ప్రాణాత్యయ కాలమందును వదలనివారు వీరశైవులు.

# "శివం"

శైవమతము వేదాగమప్రామాణ్యము కలదనుటసత్యము, వేదములందు సంగ్రహముగ విషయప్రతిపాదన కలదు, కానవానియందు స్పష్టరూపముననే మతమునకును ప్రామాణ్యము చూపుట కష్టము. వేద వేదాంతములలో శైవము సుస్పష్టముగ "రుద్రుని త్ర్యంబకుని, శివుని పూజించి ధ్యానించమని చెప్పబడినది.

"ఆవో రాజాన మధ్వరస్య రుద్రంహోతారం సత్యయజం రోదస్యోః అగ్నిం పురాతనయిత్నో రచిత్తాద్ధిరణ్య రూపమవసే కృణుధ్వమ్"

"త్రియంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్".

"మాత్వా రుద్ర చుక్రుధామా నమోభి ర్దుష్టితి వృషభ మా సహూతి",

"యదా చర్మవదా కాశం వేష్టయిష్యంతి మానవాః
తదా శివ మవిజ్ఞాయ దుఃఖస్యాంతో భవిష్యతి

## శైవాగమములు

ఆగమములలో నుత్పత్తి నాశములు లేని శివసంబంధమైనవి "28" కలవు

"కామికం యోగజం చింత్యం కారణం త్వజితం తథా
దీప్తం సూక్ష్మం సహస్ర చ అంశుమత్ సుప్రభేదకం
విజయం చైవ నిశ్వాసం స్వాయంభువ మథానలం
వీరంచ కారణం చైవ మకుటం విమలం తథా
చంద్రజ్ఞానంచ బింబంచ ప్రోద్గీతం లలితం తథా
సిద్ధం సంతాన శైవోక్తే పారమేశ్వర మేవచ
వాతూలం కిరణం చైవేత్యష్టా వింశతి సంహితాః"

యిందు 'చంద్రజ్ఞాన - మకుటోత్తర" కారణోత్తరములను మూడు గ్రంథములు మాత్రము విస్తృత విచార మందున్నవి.

యస్సర్వశాస్త్ర విదపి కర్మయోగ రతోపివా
శాంభవ వ్రతహీనోయం ప్రోచ్యతే కేవలం పశుః" మకుటోత్తరం

దీనినే యథావాక్కుల అన్నమారాధ్యులు తమ సర్వేశ్వర శతకములో "తన యుక్తిన్ భవదంఘ్రి వంకరుహ సద్భక్తుండు పాపంబుచేసిన పుణ్యంబగు, భక్తిహీనుడు శ్రుతుల్ చేపట్టి పుణ్యంబుచేసిన పాపం బగు; దీనికింతయును జర్చింపంగ జండీశ్వరుండును దక్షుండును సాక్షు విన్న; నగరాట్కోదండ! సర్వేశ్వరా!" అని నుడివిరి.

"యదేతచ్ఛాంభవం నామవ్రతం శ్రుత్యంత సమ్మితం
పునర్భవ ప్రహాణాయ ముముక్షు స్తత్స మాచరేత్"
"కారణోత్తర"

వీరాగమములో ఇత్యాగమే షు వేదేషు వేదాంతో పనిషత్సుచ
ధర్మ స్తుశాశ్వతః ప్రోక్తో ముక్తే ర్మాహేశ్వరో మహాన్"

అని ముక్తిమార్గములలో శైవము శ్రేష్ఠమైనదనియు, శివపూజ ఇష్ట లింగారాధన మనియును తెలుపబడినది.

## ప్రస్థాన సంప్రదాయము

ఉపనిషత్ప్రతిపాది తార్థమునగల సందేహ నివారణకై సూత్ర రచన జరిగినదనుట సువిదితము. ఇట్టి సూత్ర సాంప్రదాయములో ఒక టవ అధ్యాయము మూడవ పాదమున ప్రమితాధి కరణమున "శబ్దా దేవప్రమితః" అను సూత్రము దహరాధికరణమున ఛాందోగ్య విద్యలో ఉపాస్యుడుగ నిర్ణయింపబడిన దహరాకాశ శబ్దవాచ్యుని నిర్ణ యించుటకై ప్రవృత్తమైనది. దీనికి విషయవాక్యముగ నీలకంఠ - శం

కర – రామానుజ మున్నువారిచే "కఠవల్లీ మంత్రము" "అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి ఈశానో భూతభవ్యస్య నతతో విజుగుప్సతే ఏతద్వైతత్" అని గ్రహించబడినది. ఇందలి ఈశాన్య శబ్దము దహరాకాశ శబ్దవాచ్యుడగు ఈశానుడు. ఈశానుడనగ ప్రభు వాచక వ్యుత్పత్యర్థముద్వారా గ్రహించుట జరిగినది. కాని రూఢ్యర్థములో అమరకోశములో చెప్పినట్లు శంభురీశః పశుపతిః శూలీమహేశ్వరః ఈశ్వరః శర్వ ఈశానః" అని శివపర్యాయపదముగ గ్రహింపనగును. ఉప్పే అను యోగమువలననను ఈశాన శబ్దము శివపర్యాయ వాచకముగ తెలియనగును.

### పురాణ సంప్రదాయము

వ్యాసునికి కాశిలో వాగ్భుజ స్తంభనగాగా నారాయణుడు ప్రత్యక్షమై శివారాధన ముఖ్యమనియు శివునికంటె దైవము లేడనియు స్కాందములో కాశీఖండములో తెలిపినట్లు గలదు.

"అపరాద్ధం మహ చ్ఛాత్ర భవతావ్యాస నిశ్చితం
తవైత దపరాధేన భీతిర్మేపి మహత్తరా
ఏక ఏవహి విశ్వేశో ద్వితీయో నాస్తికశ్చన
తత్ప్రసా దహం చక్రీ లాక్ష్మి శస్త్రత్ప్రసాదతః"

పరాశరుడు "హరునికృపన్ ధరిత్రినయం అభివృద్ధిగాంచనున్న మద్గురువుల నందరన్" అని చెప్పకొనుటచేత "వ్యాసుడు-అతని తండ్రి పరాశరుడు-తాతశక్తి-ముత్తాతవశిష్ఠుడు-కొడుకుశుకుడు" ఆవంశమందలి యందరును శైవులని తెలియుచున్నది. కాన పురాణములు శివ పారమ్య ప్రతిపాదకములు.

శివుని పరమదైవముగనమ్మ, తత్సేవచే శివానుగ్రహ పాత్రులై తరించువారుశైవులు. తన తమే శైవము.

"శివం" అనగ మంగళకరము "సత్యం-శివం-సుందరం" స్వరూపుడు శివుడు. "శి" కారము నిత్యసుఖమును తెలుపును "ఇ" కారము పురుషుని బోధించును. "వ" కారము అమృతశక్తిని తెలుపును. "సత్య సుఖరూపమగు నానందము ననుభవింపజేయుశక్తిని శివుడు ప్రసాదించును" అని శివశబ్దార్థము. శివునకు జపపూజాస్తోత్రాది రూపమగు నమస్కారమును సమర్పించుచున్నానని శివ పంచాక్షరీమంత్రార్థము. "శివ" యను రెండక్షరములు హరియించును పాతకముల సంభుజరాభా" అని చెప్పినట్లుగ మహాపాతకముల బోద్రోలి నమస్కారముతో చిత్తశుద్ధి కలిగించి మోక్షమునిచ్చును. మూడు వేదములమధ్య యజుర్వేదములలో "నమః సోమాయచ" అను అనువాకములోని దేవపంచాక్షరి. కానశివారాధనతో సర్వమంగళ స్వరూపుడగు శివుకి దెలియవచ్చును.

## శివోపాసన

భూమిగోరు వారు బూడిదై పోయిరి,
ధనము గోరు వారు దగ్ధమైరి,
నిన్ను గోరు వారు నిత్యులై యుండిరి,
పాప భయ విలింగ భావ లింగ! — "శంకరారాధ్య"

"శ్రీ ముదిగొండ శంకరారాధ్యుల"వారు "భావలింగశతకము"లో శివోపాసన ప్రశస్తిని తెలిపి శివునిధ్యానము చేయువారు నిత్యులని నుడివిరి. శివోపాసన జన్మతరింపునకు ముఖ్యమైనదని శ్రీవారు తమ కీర్తనలలో "మరువదగరు శివుని మనసునను తెలివిలేక" అని తెలిపిరి

నానావిధ దుఃఖాకులమైన జననమరణ సముద్రమును దాట గోరువారు సకలశాస్త్ర విదితమగు "శాంభవవ్రతము"ను నాశ్రయింప వలయును నిగమాదులందీ శాంభవవ్రతము "అత్యాశ్రమ-పాశుపత-శాంభవ-శిరోవ్రత"మను నామములతో గీర్తింపబడుచున్నది. దివ్య

జ్ఞానయావయునకు సిట్టి "శివోపాసన" ద్వారా పరమేశ్వరానుగ్రహము ప్రాప్తించును. అనేక జన్మార్జిత పుణ్యవిశేష సంభవము శివజ్ఞానసిద్ధి శాంభవ వ్రతావలంబి భవబంధము నుండి ముక్తినొందును.

పైరు మొలకెనను కాపాడకున్న నశించును. అటులే శివుని యందు విశ్వ లేని వానికి జ్ఞానోదయమైనను ఫలితముండదు. అపవిత్రమగు చిత్తముగల వానికి జ్ఞానోపదేశము జేసిన మరుభూమిలో నాటిని విత్తనము జ్ఞానోదయము జరుగదు. కాన ముక్తిదమగు శివజ్ఞానోపలబ్ధికి "ఆణవమాయిక - కార్మిక" ములను దోషత్రయమును శమింపజేసి "ఇష్ట - ప్రాణ - భావ" లింగములను మూడు లింగముల యొక్క సంబంధముగల శాంభవదీక్ష నవలంబి పవలయును.

అష్టావరణ పంచాచార మండితమైన నీ శివదీక్ష "అథర్వ శిరోగతమైన నీ వ్రతము శాఖా సంజ్ఞాన భేదములు కలిగిన యోగ "శివజ్ఞాన"మని దేవీభాగవతము స్మరించుచున్నది, శివజ్ఞాన సిద్ధికి మూలాధారము శివోపాసనయే.

"సృష్టి - స్థితి - లయ - తిరోధాన - అనుగ్రహ" పంచ కృత్యపరాయణుడగు పరమేశ్వరునకు కార్యకారణములు స్వోపయోగమున కగుటలేదో సర్వము లింగమునందే తెలియవలయును. చరాచరాత్మకమగు సకల ప్రపంచము ఎందు జనించుచు వృద్ధి చెందుచు, లయమందుచున్నదో అదియే మహాలింగము. లింగమునకంటె బాహ్యమున నేమియు లేదు. మూర్తామూర్త రూపముల భక్తుల ననుగ్రహించువాడై, విశ్వరూప విరూప సంపన్నుడై అనంత జీవ సాదృశ్యము కలవాడై. సర్వతత్త్వాలయుడు మరియు తత్త్వాతీతుడునునై, సర్వాధిపతియై. "మహేశ్వర సదాశివ శివ" నామవర్ణితుడై, జ్యోతిరూపుడై, తమసంపరుడై, సచ్చిదానందుడును శివపరమాత్మనే మహాలింగరూపమున నుపాసింపవలయునని శాస్త్రములు తెలుపుచున్నవి.

సర్వము బిందు నాదాత్మిక, బిందురూపిణియగు దేవి తల్లియు, నాదరూపుడగు శివుడు తండ్రియు నగుచున్నారు. తల్లిదండ్రుల లొసగిన ఐశ్వర్యము పుత్రున కనుభవనీయము కాన జగతః పితరులగు పార్వతీ పరమేశ్వరుల యైశ్వర్యము (ఈశ్వరత్వము) పొందగోరి శివశక్త్యాత్మక మగు లింగమును పూజింపవలయును.

"నా రుద్రో రుద్ర మర్చయేత్" అనునట్లు రుద్రుడు కాక రుద్రుని పూజింపరాదు. అనిన, రుద్రుడై రుద్రుని పూజింపవలయును. కాన సర్వాంగ లింగ సంబంధమగు పాశుపత వ్రతరూప శివోపాసన వలన సాధకునకు రుద్రత్వము సంభవించుచున్నది. మనో హృదతాములలో మహాలింగమును స్థాపించుకొని, రుద్రాత్మకముగ శరీరమును గావించి భూతి రుద్రాక్షాది శివోపాసన జేయువలయును. కాన "ప్రాణలింగాంగ సంబంధీ రుద్ర ఇత్యభిధీయతే" అని చెప్పబడినది.

శివపూజలో "విభూత్య భ్యుక్షణ - స్నపన - అంగాప్లావన - ధూప సంవీజన - ధూప ప్రసారణ - గంధావతంసన - అక్షతారోపణ - పుష్పోపహరణ - దీప ప్రకాశన - నైవేద్య - తాంబూలదాన - వస్త్రావరణమున్నగు" అర్చనా సంబంధమగు ఉపచారములు. "ఆసన్య ఆహ్వాన అర్ఘ్య - పాద్య - ఆచమన - యజ్ఞోపవీత - మాల్యానులేపన - ఆభరణ ఛత్ర - చామర - తాళవృంత - దర్పణ - ఘంటానాద - శంఖనాద - గీతాగాన - వాద్యశ్రవణ - నృత్యదర్శన - ప్రదక్షిణ - నమస్కార - స్తుతి - యాచ్ఞా - విజ్ఞప్తి - పస్త్రి ప్రాతరణ - విసర్జనములు" కూడ ఉపచారములు.

ఇష్టమగు పూజచే పూజింపబడుచున్నది గాన, అనిష్టముల దొలగించి ఇష్టముల సిద్ధిప జేయునది యగుటచే "ఇష్టలింగము" అని పిలువబడుచున్నది. ఇది సకలము. లింగమునం దెల్లపుడు పరమేశ్వరుడు

సన్నిహితుడై యున్నాడు. లింగమును అనగ శివుని పూజించి ధ్యానించుట వలన శీఘ్రముగ ప్రసన్నుడగును.

"స్థూల దేహమున నున్న ప్రాణలింగమును ధ్యానించుచు, కారణ దేహమున నున్న భావలింగమును ఆత్మగ భావించి సాధకుడు మృత్యు పాశమునుండి విడువబడుచున్నాడు" – (లింగపురాణము)

మనోభావముల ప్రాణభావ లింగోపాసనా స్థితిని బోలి స్థూల స్థూలదేహమున అవినాభావ సంబంధమునను్న ఇష్టలింగమును వామ హస్త పీఠమున నుంచి పూజించుట విధియైయగును. కావున పీఠపూజా ర్పవకంబై కరపీఠార్చనము శ్రేష్ఠమని పేర్కొనబడుచున్నది.

ఏకాగ్రతయొక్క బలముచేత సాధకుడు ఒక విషయమును గూర్చియో లేక మూర్తినిగూర్చియో లేక భావమును గూర్చియో జ్ఞానము తనంతట తాను మనస్సునందు ప్రత్యక్షమగునట్టుల ఆ విషయమునో లేక ఆ మూర్తినో లేక ఆ భావమునో తన మనసునందు అనుసంధానము చేసికొనుట ధ్యానమగును. "ఆత్మాత్వం, గిరిజా మతిః, పరిచరాః ప్రాణాః," అను శంకరాచార్యులవారు మానసిక పూజతో హృదయకమలమున మనస్సునకును ప్రాణమునకును స్థానమగనుండి ప్రాణలింగము జ్యోతిర్లింగముగ భావింపబడును శివోపాసన మూలమగుచున్నది. కాన జ్యోతిర్మయమగు ప్రాణలింగమునకు హృదయకమలము స్థానము.

❖

భావము మానవచేష్టకు ఇద్ధరూపమగు చున్నది. మనస్సున కలితమైనదియును, భావ గ్రాహ్యమైనదియు. భావాభావనకరమగు" "భావలింగము" సాధకుని శివోహం భావనా సిద్ధికి [శివోపాసనము అఖండ లింగానుసంధానమున కాస్పదమగును. అనగ దేహవిషయముల నెల్ల మరచి, అన్నివిషయములు శివవిషయముగ దృఢ భావము)

కలిసి అఖండ శివతత్త్వమును భావించునట్టి మహాత్ములకు భావలింగ స్వరూప మనుభవనీయ మగును.

"ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల? భాండ శుద్ధి లేని పాకమేల? చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా? అనునట్లు శివపూజకు చిత్తశుద్ధి యావశ్యకము, చిత్త శుద్ధి గల్గి చేసిన పుణ్యము భావనా విహితమగు కర్మము అత్యంత పావనమగుచున్నది.

కర్మసిద్ధియు, మనశ్శుద్ధియు భావనచేతనే సంభవములగును. నిత్యనైమిత్తికాదికము కర్మము శివభావనచే చేయు సాధకుని గుణ దోషములు బాధింపజాలవు. "శివోహం" భావనచేత మానవు భవగత పాశుడగుచు భ్రమరకీటక న్యాయముచేత శివుడగుచున్నాడు.

శాంభవదీక్షితులకు షట్స్థలాత్మకమైన శివపూజ విహితము కదా? ఇవి క్రియా - జ్ఞానరూపకమగుచున్నది "భక్త - మహేశ్వర - ప్రసాది" ములను పేరుగల మూడు స్థలములు కర్మయోగమనియును - "ప్రాణలింగి - శరణ - ఐక్య"ములను పేరుగల మూడుస్థలములు జ్ఞానయోగములనియును పిలువబడుచున్నవి.

"శైవము" భక్తస్థలములో యమనియమాదులతో గూడిన గాడై భస్మరుద్రాక్ష ధారణలును, మహేశ్వర స్థలమున స్థిరాసనము కలవాడై మలత్రజనము చేయుటయును, ప్రసాది స్థలమున లింగ నిరీక్షణము చేయుటయును, ప్రాణలింగ స్థలమున అర్చనాదిక పూజయును శరణస్థలమున నైవేద్య సమర్పణమును, ఐక్య స్థలమున ప్రసాదోపభోగములును నిర్ణయములైనవి,

జీవాత్మ అంగరూపమైన పరమాత్మ లింగమగును. జీవ పరమాత్మలకు ఉపాస్యోపాసక. గురుశిష్య పూజ్య పూజకు శివాత్మావస్థితి నిరూఢము.

శరీరికి భోగోప భోగములకు చెందిన సకల మనోవ్యాపారములు ములు శివకార్య ప్రయోజనములుగ గుర్తించుటకును, సమస్తము శివ భావనగ భావించుటకును, సమస్తము శివభావనగ భావించుటకును, శివాద్వైత సిద్ధితో అఖండ లింగాను సంధానవ్యవస్థ ప్రాప్తించుటకు శివోపాసన అవసరము.

విశుద్ధ మానసుడగు శైవుడు శివధ్యాన - శివపూజాదులచే పద్మపత్రమునందలి నీటి బిందువువలె స్వకర్మముచే బంధింపబడడు. శివోపాసనా పరుడగువాడు ఏది చింతించినను నది శివమయమై శివధ్యానమే యగుచుండును.

శైవవ్రత (పాశుపతవ్రత) శివభక్తి (శివదీక్షాప్రాప్త ధర్మాచరణ నిష్ఠ) శివార్చన (బాహ్యలింగారాధన) శైవీధ్యానము (ప్రాణలింగోపాసన) శివజ్ఞాన భావలింగానురాధనానురూప మహాలింగాను సంధాన రూపక శివోపాసనాత్మకమైన శివయోగము (శివపూజ) ఉపాసనా మార్గములలో రాచబాటయగును.

“శివ ఏకో ధ్యేయ శ్శివంకర స్సర్వమన్యత్పరిత్యజ్య”—“అధర్వ శిఖ’. అనగ మంత్రాంతర, దేవతాంతర, క్రియాంతరముల సర్వమును విడచి శివునినే ధ్యానము చేయవలయునని భావము.

ఉపాసన యనగ పరమేశ్వరుని మనోవాక్కాయములచేత, చేయు సేవ. భస్మ గంధాక్షత పుష్ప బిల్వ ధూప దీప సమర్పణ ప్రదక్షిణ నమస్కారాదుల చేయు సేవ “కాయిక సేవ”. భస్మాది సమర్పణ కాలములో గావించు మంత్ర పఠనము, విజ్ఞప్తి స్తోత్రాదులు ‘వాచిక సేవ’’, అభిధ్యానము “మానసిక సేవ.”

అన్య విస్మరణ పూర్వకమగు మానసిక ధ్యానముచేయుట కష్టయు కావున భక్తుడు కాయిక సేవయందు ప్రవృత్తుడగును.

ఇట్టి సేవల వలన జరుగు మార్పు భావ పరిణామముగ మారి, తద్ద్వార చిత్తశుద్ధికి కారణమగును. ఉపాసనకు పూర్వమందు భుజించినది యన్నము. ఉపాసనానంతరము భుజించినది ప్రసాదము. అటులే లోకములో పూజకు పూర్వము ధరించునవి పుష్పములు మరయు పూమాలలు పూజానంతరము ధరించిన నది నిర్మాల్యము. కాన బాహ్యపూజయందు భావపరిణామమునకు చక్కని యవకాశము గలదు.

భావ పరిణామము కలిగిన గాని చిత్తశుద్ధి కలుగదు. చిత్తశుద్ధి కలిగినగాని మనశ్చాంచల్యము పోదు. అపుడు అంతర్లింగాను సంధానమునకు అవకాశము ఏర్పడును. అనగ బాహ్యోపాసనము వలన బహిరింద్రియ జయమును, దానిద్వార భావపరిణామము కలిగి తద్ధార చిత్తశుద్ధి యేర్పడి అంతర్లింగాను సంధానమున కవకాశము కలుగునని తెలియుకును.

కాన అంతరుపాసనమునకు బాహ్యోపాసనయును, బాహ్యోపాసనకు బాహ్యలింగధారణమును నావశ్యకమును నావశ్యకములు.’’

తీర్థస్నాన మాత్రమున మోక్షము లభించునన్నచో నా తీర్థములందు బుట్టి మరణించు జంతువు లన్నిటికిని ఎందులకు మోక్షము రాదు గంగాది నదీస్నాన సంకల్పము కలిగిన క్షణమునుండి గంగాస్నానము చేసి యింటికి చేరువరకు భావమునందు పరిణామము జరుగుచుండును. శివధ్యానము ద్వార జరుగు పరిణామము మోక్షప్రాప్తికి ప్రధాన సాధనము

అంతర్లింగమనగ శరీరాంతర్భాగములోని లింగము. ‘‘హృది హ్యేష ఆత్మా’’ ‘‘రుద్రో జనానాం హృదయే సన్నివిష్టః’’ ‘‘ప్రాణేష్వంతరతః సోలింగమాహుః’’ అను వాక్యముల ద్వార రుద్రుడు లింగరూపమున హృదయమందున్నాడని భావము.

కాన హృదిలో శివోపాసన చేయువాడు రుద్రస్వరూపుడై రుద్రుని ధ్యానించురని భావము.

## శివపూజ

శ్రీనాథుడు "కాశీఖండము"లో విశ్వానరుని "అఘమర్షణ స్నానము - సర్వాంగభూతి సముద్ధూళనము - తిర్యక్పుండ్ర ధారణము - రుద్రాక్షమాలికాధారణ - చిత్తశుద్ధి - వేదాంత విజ్ఞానము - పరంపరంజ్యోతిర్లింగమూర్తిని భావించి భావించి చూచు ఆత్మానుసంధానము" శాంభవ దీక్షితుల శివపూజా విధానమును దెలుపుచున్నవి.

"మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక తత్పరుడు - నిరంతర శంభు పదాబ్జ పూజా నిరతుడు - తెలుగు భక్తకవి" అగు "శ్రీ పోతనామాత్యులు" చేతులారంగ శివుని పూజింపనివారి జన్మ తల్లుల కడుపు చేటుగ" వర్ణించిరి.

"రుద్రలోకమునుండి వచ్చి మానవులుగ బుడమిపై నుద్భవించి, జగద్ధితము కొరకు త్ర్యంబకపూజ చేయు శివభక్తులు నానావిధ చారు చేష్టలతో చరించుచుందురు" అట్టి "భవు నర్చన జేసి వరము వడసిన వారి"ని నుతించు భాగవతులకు పూర్వపుణ్య ఫలమేనని తెలుపబడినది.

శివపూజ ప్రాధాన్యత నెగ్గడించునపుడు తన్మతి విషయము మాలోచింప వలయును. "పూర్వశైవులు" పంచాయతనారాధకులు అనగ మను పీఠ మధ్యమునందుంచి. మహేశ్వరునిగ, శివునిగ దలంచి, "అంబిక - ఆదిత్య - విష్ణు, గజానన మూర్తులను ప్రతిష్ఠించి, శివపూజలను చేయుదురు. అట్టివారిలో ప్రముఖులు శ్రీ ఆదిశంకరాచార్యుల

వారు. ఆర్ష ధర్మ ప్రచారమునకై జీవిత మర్పించిన శ్రీ శంకర భగవత్పాదులవారు తమ "అస్తి" వాదమునందు 'నిరంజనం - నిర్గుణం' అను భగవత్స్వరూపమును ప్రతిపాదించి, స్కాందులను తప్ప మిగిలిన మతమువారిని దనవైపు ఆకర్షించినటుల చరిత్రాధారములచేత నూహింపబడుచున్నది. అద్వైత ప్రచారకులును మరియు శ్రీవారును లింగమును పూజించెడు పూర్వశైవులు. "తతోపి భక్తిః తరుణేందు శేఖరే" అని "నిర్గుణములో సగుణము" నూహించిన "అప్పయ్య దీక్షితులవారు కూడ పూర్వశైవులలో ప్రసిద్ధి నొందిరి.

మహాకవి ధూర్జటియును 'విన్నే రూపముగ' దలంతు మదిలో నీ రూపు మోకాలో, కుంభమొ, మేక పెంటికయొ' అను భక్త సందేహముల దెలిపి 'నా కన్నారం భవదీయ రూపు సగుణాకారంబుగ జూపవే' అని పరమశివుని దర్శనమునకై ప్రార్థించెను.

'ఉత్తర శైవులు హృత్కమల పీఠమునందు లింగధారణ జేసుకొనిన పాశుపతులు. వీరు గురుదీక్షచే మానవ పిండమును మంత్ర పిండముగ జేసుకొని, ప్రాణము మరియు లింగములకు నవినాభావ సంబంధము కల్పించుకొని, వెన్నెలకు మరియు చంద్రునికి గల సంబంధము వలె తలంచి శివపూజ చేయుదురు. ధనము దగ్గరనున్న వారికి తను ఇతరుల వద్దకు ధనము కొరకెట్లు తిరుగవలసిన యవసరముండదో, అటులనే హృత్పీఠమున లింగధారణ జేసుకొనిన పాశుపతులకు వారెచ్చటికి వెళ్ళిన నా స్థలమందే శివపూజ చేసుకొనుటకు అవకాశ ముండును.

మహారాజాధిరాజు స్వీయ రక్షణకై అష్టవిధ ప్రాకారములు గల కోటను నిర్మించుకొని పటిష్ఠముగనుండునో అటులనే 'అష్టమూర్తి' అగు శివుని (1. భూమి = శర్వరూపము. 2. నీరు = భవరూపము, 3 అగ్ని = రుద్రరూపము, 4 వాయు = ఉగ్రరూపము , 5. ఆకాశ

—భీమరూపము, 6. హృత్ క్షేత్రజ్ఞుడగు ఆత్మ = పశుపతిరూపము. 7. రవి = ఈశాన రూపము, 8. చంద్ర = మహాదేవరూపము :- శివుని అష్టమూర్తి సర్వరూపము). పూజించి, అష్టావరణములుచేత శరీరమును పాపములనెడు శత్రువులనుండి రక్షించుకొనుచుందురు. ఇట్టి శైవులు క్రియారూప బోధకులు మరియు క్రియాచరణ శీలురై యుందురు

"దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః" అనునట్లు లింగధారణ జేసుకొనిన ఉత్తర శైవులు పవిత్ర స్థలములగు దేవాలయములవలెనే పవిత్రులు. దేవాలయ దర్శనము పవిత్రమైనటులనే లింగధారులగు శైవుల దర్శనము కూడ పవిత్రమే. కావుననే లింగధారణ జేసికొనిన శివభక్తులలో వయోభేదములేక అందరును పూజార్హులుగ భావింతురు.

శైవులు ప్రతి నిత్యము దీక్షాగురుని- అతిథిరూప మహేశ్వరుని లింగమును పూజను చేయుదురు. అనగా, తన ప్రాణలింగమునందు గురువును మరియు మహేశ్వరుని ఆహ్వానించుకొని, యోగములో "ఇడ - పింగళ - సుషుమ్న"లను కనుగొని అభ్యసించిన విధముగ పవిత్ర త్రివేణీ సంగమమువలె నూహించి శివపూజను చేయుదురు. అందువలననే "యమలోకో నవిద్యేత సదావై లింగధారిణాం" అను వాక్యము సార్థకమగుచున్నది.

రాముడు రామేశ్వరములో రామలింగేశ్వరుని ప్రతిష్ఠించి పూజించుటచేత శివపూజా మాహాత్మ్యము రామాయణ సారముగను, కృష్ణాదులు కైలాసయాత్ర జేసిన తరువాత "సాంబాది" సంతానమును బొందుటచే శివపూజ భాగవత సారముగను, అర్జునాదులు చేసిన శివపూజ భారత సారముగను గ్రహించినచో "శివపూజ' సర్వోత్కృష్టమైనదిగ భావింపవచ్చు.

"ఓం నమో భగవతే రుద్రాయ" అని శత రుద్రీయ మారంభములో చెప్పుటచేతను. "ఈశ్వర సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి (ఇచట హృత్కమలములో లింగధారణ చేసుకొనుట గ్రహింపనగును.) భ్రామయన్ సర్వభూతాని మంత్రారూఢాని మాయయా, తమే వంశ శరణం గచ్ఛ సర్వభావేన భారత" అని భగవద్గీతలో తెలుపుటచేతను. "ఈశానః సర్వవిద్యా నామీశ్వరః సర్వభూతానాం బ్రహ్మాది, పతిః బ్రహ్మణాది పతిః బ్రహ్మా సదాశివః" అను శ్రుతియాధారమువలనను శివపూజ ప్రాధాన్యత తెలియుచున్నది.

"గణనాంక పద్ధతి"తో నాలోచించిన వ్యాసుని అష్టాదశ పురాణములలో 10 శివ పురాణములు, 4 విష్ణు పురాణములు 4 శక్త్యాది పురాణములుగ కన్పడుచుండుటయేగాక, సర్వపురాణాంతర్గత మగు నాలుగు లక్షల శ్లోకములలో 3 లక్షలు శివాత్మకములు 1 లక్ష అన్య దేవతాత్మకములుగను గ్రహింపబడుటచేత "శివపారమ్యము" తెలియుచున్నది.

"శ్రీ వాణీశ రమేశ యీశ్వరుల మున్ సృష్టించి, అవ్వారి కాయా విశ్వోద్భవరక్షణ వ్యయకృతి వ్యాపారముల్ నేర్పి, తానా వంకన్ కనినట్లు కానని యటుల్ వ్యాపించి, సర్వాత్మకుండై వర్తించు సదాశివున్ గొలుతు స్కాందాంత క్రియాసిద్ధికిన్ అని చెళ్లపిళ్ళ వేంకట శాస్త్రి గారు "సదాశివపూజ"ను గూర్చి తెలిపిరి.

పట్టణ గ్రామాదులలో శివాలయములలో శివపూజ జరుపుటతో విశ్వరూప ప్రాణిజాలమును పరిపుష్టము చేసి, అనాతురముగ జీవనాలమును చేయుటయే ప్రధానమని తెలియుచున్నది." విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ అనాతురం' అని యజుర్వేదము పై విషయమునే సమర్థించుచున్నది.

'శివధర్మ ప్రకాశిక''లో "క్రీడా భావనతో బాలురు కూడ శివారాధన జేసినచో నా పిల్లలు సైతం రుద్రలోకములో రుద్రలోకములో రుద్రస్వరూపము లగుదురు" అని శివపూజ ప్రాధాన్యత తెలుపబడినది.

శివపూజ మూడురకములుగ తెలుపబడినది, 1) శుద్ధము : లింగరూప శివపూజ శ్రేష్ఠము అర్జునుని చేతిలో అశ్వత్థామ ఓడిపోవుటకు కారణము పరమపాశుపతుడగు అర్జునుడు లింగరూపమున శివపూజ చేయుటవలనను, అశ్వత్థామ ప్రతిమారూప (సగుణ) శివపూజ చేయుటయే కదా! అని మహాభారతములో తెలుపబడినది.

పూర్వము లింగపూజచేయునపుడు లింగమును వివిధ ధాతు రూపములలో నుంచి పూజచేయుచుండెడివారు. విష్ణువు ఇంద్రనీల స్వరూపలింగమును, బ్రహ్మశైల లింగమును, దివాకరుడు తామ్ర లింగమును, చంద్రుడు ముక్తాఫల మయరూపలింగమును, శుక్రుడు మణిమయలింగమును, వరుణుడు రత్నమయలింగమును, కుబేరుడు బంగారు లింగమును, వసువులు కంచులింగమును, నాగులు ప్రవాళ లింగమును పూజించినట్లు కలదు

శివపూజలో రుద్రము తో శివునిపూజించినచో 1) దుర్భిక్ష శాంతి 2) పశురోగ నివృత్తి 3) విషూది మరియు ఉపద్రవకరములగు రోగ నివృత్తి 4) దీర్ఘాయుః ప్రాప్తి. 5] చోరవ్యాఘ్రాది బాధానివృత్తి 6] శత్రుపరాజయము 7] శత్రుమారణాభిచారికము 8] జనవశీకరత్వము 9] రాజ్యలక్ష్మి [అధికార] ప్రాప్తి 10] మేధాశక్తివృద్ధి 11] రాజయక్ష్మనివారణము 12] సామ్రాజ్యసిద్ధి 13] జగదుపద్రవ నాశనము 14] యక్షరాక్షస భూతాద్యుచ్చాటనము - తద్వశీకర

ణము 15] సర్వజనరక్ష 16] అతివృష్టి - అనావృష్టి బాధానివారణము 17] గోశాంతి 18] విద్వత్పుత్రోదయము 19] మహాజనవరోధోపశమనము 20] మనోజవత్వ - అదృశ్యత్వాదిప్రాప్తి 21) జాతిస్మరత్వము 22) కృత్యాపాదుర్భావము 23] మోక్షసామ్రాజ్యసిద్ధి మొదలగు చతుర్విధ పురుషార్థములు కలుగునని ప్రాచీనులు తెలిపిరి. జపహోమాదులకంటె అభిషేకమునందు రుద్రము విశేషముగ వినియోగము జరుగుచున్నది. అందువలన "అభిషేక ప్రియః శివః" అని శివుని కొనియాడుచున్నారు. శివపూజవలన, తీర్థోదకము సేవించుటవలన అనేక లాభము లున్నట్లు తెలియుచుండుటచే అందురు శివపూజ చేయుట తమ ధర్మమని తలంచుచున్నాము.

## శివశరణులు

ఆయుర్నశ్యతి పశ్యతాం - ప్రతిదినం, యాతిక్షయం యౌవనం
ప్రత్యాయాంతి గతాః పునర్నదివసాః కాలోజగద్భక్షకః
లక్ష్మీస్తోయ తరంగ భంగ చపలా విద్యుచ్చలం జీవితం
తస్మాన్మాం "శరణాగతం శరణదత్వం" రక్షరక్షాధునా"

"ఆదిశంకరాచార్యులు"

దిన దినము ఆయువు క్షీణించుచున్నది. యౌవనము క్రమముగ గతించుచున్నది. గడచినదినములు మరి తిరిగిరావు జగత్తును కాలము భక్షించుచుండును. మహానదీ తరంగములవలె సంపదలు చంచలములు, నిలుకడలేనివి. మెరుపువలె జీవితము క్షణభంగురము, అందువలన శరణదాతవగు భగవంతుడా! నాకు నీవే దిక్కు. నిన్ను శరణుజొచ్చిన నన్ను రక్షింపుము. దరిజేర్చుము" ఇదియే శంకరులవారి ప్రార్థనా సారము

"శుష్క-జ్ఞానము నిరర్థకము. భక్తిపూరిత శరణాగతియే జీవితో ద్ధరణమునకు, మోక్షప్రాప్తికి పరమ సాధనమని" విశ్వసించిన మహా జ్ఞాని ఆదిశంకరాచార్యులవారు.

"మహాయోగి - మహర్షి" అగు శ్రీ రామకృష్ణపరమహంస ప్రియ శిష్యుడగు శ్రీ వివేకానందస్వామివారు "నేను పాశ్చాత్య దేశములందు నివసించినప్పటికిని, జీవితమున చక్కగ అనుష్ఠింప యోగ్యమైనది ఆత్మానుభూతి భావమ్" అని ఇప్పటికిని విశ్వసించు చున్నాను, అన్యమునుగూర్చి నాలోచించు ప్రతిక్షణమును నాకు నష్ట దాయకమగును. భౌతిక శాస్త్రముల వైచిత్ర్యములు సైతము వ్యర్థములే అను భావము నుండి నన్ను దూరమొనర్చు ప్రతివిషయ మును నిరర్థకమే. పశువువలె అజ్ఞానిగనున్నను, దేవతలవలెను జ్ఞానిగ నున్నను, జీవితము క్షణభంగురము. చింపిరిగుడ్డలతో పేదలలో పేద వాడవుగ నున్నను, భాగ్యవంతులలో లక్ష్మీసంపన్నుడవుగ నున్నను జీవితము మాత్రము క్షణభంగురమే. అణగద్రొక్కబడిన పీడితుడనై పాశ్చాత్య దేశములందలి యొక మహానగమున రాజవీధిలో నివసించు చున్నను, మహారాజాధిరాజుగ కోటానుకోట్ల ప్రజలపై అధికారమును చలాంచుచున్నను జీవితము క్షణభంగురమే.

"మంచి ఆరోగ్యవంతుడైనను, దుర్బల రోగియైనను జీవితము క్షణభంగురమే, మధురమైన స్వభావమును కలవాడడైనను జీవితము క్షణభంగురమే ఈ వైపరీత్య జీవితమునకు ఒకే ఒక పరిష్కార మార్గము దివ్యౌషధము కలదు. అదియే భగవంతుడు. అదియే సనా తన ధర్మము."

"కాన అట్టి భగవంతుని శరణు జొచ్చుట దప్ప వేరొండు సులభ తరుణోపాయము లేదు." తెలిపిరి.

దివ్యచైతన్య వికసితమైన అంతరిక్షములోని రుద్రలోకము నుండి ఆచేతన తేజస్సుయొక్క రేణువులు ధారాప్రవాహముగ భూమిలో నవతరించి, మానుష్య మాశ్రయించి, జగద్ధితము కొరకు అనేకవిధములుగ చారుచేష్టలతో త్ర్యంబక పూజకులైన శివశరణులు పుడమిపై చరించుచుందురు.

మునియోచనచేత, శివాజ్ఞచేత, భక్తుల యుద్ధరణము కొరకు భువిలో సాక్షాత్ నందీశ్వర అవతారమై యుద్భవించి, ఏవభక్తులకు "పునర్భవము" లేకుండచేసిన వీరశైవ మతాచార్యుడగు బసవేశ్వరుడు శివశరణులలో ప్రథముడు.

ప్రవృత్తి మార్గము లేక నివృత్తి మార్గమును చేరిన మహాయోగులలో శివయోగులు ముఖ్యులు. కామాది అరిషడ్వర్గము నడంచుటచేత తామసికాది గుణత్రయము దూరమగును. దుష్టములైన నింద్రియాదుల పొగరు తొలగించుటచేత అష్టవిధములైన మదములణగారును. ఆరు విధములగు ఊర్ములను నిలువనీయక పోవుటచేత కర్మేంద్రియగతి నశించును. వికృతములను తొలగించుటచేత - వకల సంశయములు నాశనమందును. అట్టి యవస్థలో - శివయోగము - ఒరవవలయుననిన ఉపకారాపకారములు - జనుల నిందాస్తుతు లొక్కగతిగ నుండవలసియుండును. అట్టి శివయోగులకు - తమము అణగారిపోవుటచే - మనము సంతసమునందు, "ఆనందో బ్రహ్మ" అన్నమాట సత్యమై - "శివానంద స్వరూప" జ్ఞానము కలుగును.

"కుండలినీ" అను సర్పశక్తికి గల వంపులను పోగొట్టి - ఒకే చక్కని మార్గములో, షట్ స్థలములు - మరియు - షట్ పద్మముల ద్వార "ప్రసారము"న దానిని చేర్చుచు "శివానందము"ను పొంద

ప్రయత్నించువారు శివయోగులు. కాముని దహింపజేసి, యముని మార్కండేయునివలె త్రిప్పడజేసి, భ్రమను వదలిపెట్టి, చింతావృక్షము నందలి భయాదులనెల్ల నణచిపెట్టి. భూమిలతాంతములలో దృష్టిని నిలువ చేసి, నిజ హృత్సీమ అను రాజ్యములో శివస్వరూపమును నిలిపిన వారు శివయోగులు.

ఇట్టి శివశరణులు స్వానుభవామోదితులై, సుఖశాంతులై, షట్కాల శివపూజా ధురంధరులై, సగుణయోగ జ్ఞానమును గుర్తించి, సచ్చిదానందస్వరూప విజ్ఞానులై, రుద్రలోకమునుండి దిగివచ్చి, జగద్ధితము కొరకు మాత్రమే మానుష శరీరధారులై, శివపూజచేయుచు, వివిధములైన కార్యములను లోకములో చూపువారు మహర్షులైన శివశరణులు.

సత్యము దప్పనివాడును, దురాచారుండు గానివాడును, ఔచిత్యం బేమఱనివాడును, దుర్జనుల గోషినిబొందనివాడును, భక్త సాంగత్యం బాడట బాయనివాడును, మదనుగ్రస్తుండుగాను, ముల్లోకములలో బెంపొందువాడు శివభృత్యుడగు శివశరణుడు.'' అని పెద్దలు నుడివిరి.

శరీరమను అడవిలోనున్న అహంకారమే భయంకర మృగమనియును, స్వాంతఃకరణ తతులు ఆ యహంకారము సాపెడి శునకంబు లనియును, అట్టి శ్వానములను అంతఃకరణముల బట్టి బంధించునట్టి మనస్సు ఇనుప గొలుసనియును, ఆ మనస్సును కుదియించి వలలో వేయునది వాయునిరోధమనియును, ధ్యానమనెడు దృష్టితో ధైర్యమనెడు వింటెని జేబూని - వివేకి మరియు యోగియగు శివశరణుడు "శివోఽహం" అను బాణముచేత - అహంకార మృగమును వధించి - జ్ఞానాగ్నిచే గాల్చి - తగుపాక మొనరింపజేసి - తృప్తినొంది - భువిపై

నాశ మొందక - శివయోగ మార్గమును పొందువారు శివయోగులైన శివశరణులు.

శరీరము మూగపంటిదనియును - నాదబిందువు రసముంటిదనియును - నిష్యంద మారుతమే పరమౌషధమనియును - శరీరమందలి యగ్నియే మణిపూరకమనియును - మణిపూర్వకాది స్థానములందున్న మణుల స్వరూపములే పరమేష్ఠ్యాది ముఖ్యులనియును- ఆ యాస్థానముల దాటి మృతస్థలమును జేరుటయే "యోగసిద్ధి" యనెడు జ్ఞానము అని యెఱింగిన మహనీయులు శివయోగులు

నిత్యనైమిత్తికాది కర్మలనన్నిటిని నిర్వహించుచు, ఆర్తిని బిచ్చమడిగెడి జ్ఞానులకు శివదీక్షా ఫలములనిచ్చుచు, వానప్రస్థాశ్రమము నందువలె గార్హస్థ్య జీవనము గడుపువారు శివశరణులు.

భస్మరుద్రాక్ష ధారణచే సుసంపన్నులై, అపర శివస్వరూపులై అతిథి అభ్యాగతుల పూజలు జేయువారును, అరుదైన మంత్రశాస్త్రి రహస్యగతుల కార్యవివక్త భాగములందు వెలయునట్లుండు వారును, స్వాహాస్వధాది నిస్స్వనముల జెలంగజేయు శివాగ్ని హోత్రరతులును, చంద్రమౌళి అర్చనార్హ విరాజమాన మానసులగు వారును నిజమైన శివశరణులు.

జ్ఞానకలిత స్వాంతులైన శివయోగులకు మాత్రమే మూర్ఛస్థానమలవడును. అట్టివారు జ్ఞానముచేత మాయనుగెలిచి, మోక్షమును బొంది బ్రహ్మస్వరూపులగుదురు. దేహమును శ్రమింపజేయక, ఇంచుకంతైన కష్టమును శరీరమునకు కలుగజేయక, మోక్ష సామ్రాజ్యమును బొందుట దుష్కరము. యూపమనెడు మనస్సునకు, వాయుపూరక మనెడు రజ్జువుచేత నహంకారమనెడు పశువును బంధించి, మజ్జాన మనెడు అగ్నిలో యజ్ఞమును చేయుచు, చంద్రసుధను సోమ

పానముగ జేయుచు, సత్కర్మ చర్యాయుక్తులగు సుజనులే ముఖకర్త లని తలంచి, యజ్ఞఫలమును నాత్మగ గుర్తించి, నైజమోక్షమును పొందినవారే శివయోగులు.

రుద్రుని వసువున, రుద్రస్వరూపులై, భూలోకమునకువచ్చి, పరమనిష్ఠతో భక్తులను "గురుసేవ మరియు గణార్చనాదులను చేయుటకై ధనార్జనకై ప్రోత్సహించుచు, కల్మషరహితులై, "కాయకమే కైలాసము"ను భావనతో కాయికంబులచేయుచు అంతరంగములోని తామసాదులను మొదలంట పెరికివేయువారు శివయోగులు.

భూమిలో "గోరంత బూదినిడిన వానిని, జూచిన వానిని కొండంత వానిగ నెంచి, భక్తితత్వముతో చిల్లరయ్యలు విస్మృత చిత్తులగునట్లు చేసిన శివశరణులలో ముఖ్యులు బసవేశ్వరుడు - చెన్నబసవేశ్వరుడు - మడియాల మాచయ్య - కిన్నరయ్య మొదలగువారు.

మాంసపిండమును మంత్రపిండముగ శైవాగ్నిచేత తప్తముచేసి లింగధారులై మసలిన శివయోగులలో యధావాక్కుల అన్నమయ్య-విశ్వేశ్వర శంభుదేశికులు - వీరభద్ర అప్పయ్యవారు మొదలగువారు ముఖ్యులు.

ఇట్టి శివశరణులు భస్మ విలిప్తాంగులు, రుద్రాక్షమాలికాభరణులు, మానవ్రతులు, శీలగంపన్నులు, కరతల లింగధారులు. ఈ శివశరణులు కేవలము మూరహరాకారంబుల ధరించినవారై శివుని జూచుచు, సేవించుచు, భాషించుచు, మ్రొక్కుచు, ఉపచరించుచు,- "సాలోక్య - సామీప్య, - సారూప్య, - సాయుజ్య, - సిద్ధాంతములతో శివతత్వమును పొందినవారు శివయోగులు. ఇట్టివారు శివశరణులు.

## "శివాద్వైతము"

మూలం వేదచతుష్టయం ద్రుఢతరః స్కంధ షడంగాగమాః

శాఖాయజ్ఞ ముఖాః సుకర్మ విషయాః పత్రాణి పుష్పాణివై
భక్తిజ్ఞాన మయాని మోక్షఫలమేవం ధర్మకల్పద్రుమో
యస్మిన్ భాతి సఏవ పుణ్యనిలయో దేశోహ్యయం భారతః

వేద వేదాంతములతో, యజ్ఞయాగములతో, భక్తి జ్ఞానములతో మోక్షఫలదాయి అగు ధర్మమనెడు కల్పవృక్షము మన భారతము.

అట్టి మన భారత ధర్మభూమిలో శ్వేతాచార్యుని మొదలు" లకులీశుని వరకు శివాద్వైతమును ప్రచారము చేసిన యోగాచార్యులలో నూటపన్నెండుమంది శిష్యసంప్రదాయము కలదు.

అట్టి శివాద్వైత సిద్ధాంతమును సమాచరించుటకు ముందు అర్థావగాహనము కావలయును.

"శివుడు - జీవుడు - జగత్తు" మూడును నిత్యసత్యములని నిరూపించు శివాద్వైతములో, శరీరమునకు కరచరణాద్యవయవములవలె కారణుడైన "శివుని"కి కార్యమైన "జగము"నకు ఐక్యము అనగ శివాభిన్న పృథక్ స్థితి ఏర్పడునదగుటచేత, శివుడే స్వాంశతో కారణమనియును, జగద్రూపముతో కార్యమగుచున్నాడనియును విశదమగును.

"జీవుడు" నిత్యుడైన అనిత్యమగు ప్రకృతి సంయోగమును నిత్యముగ భావించు ప్రమాదముతో భ్రమకలవాడై జన్మపరంపరా ప్రవాహమున మునుగుచు, హఠాత్తుగ ఆచరింపబడు సుకృతముల యొక్క పరిపాకవశమున శివభక్తికలవాడై సదాచార్యోపదేశమును బొంది పాశుపత దీక్షితుడై, "భస్మరుద్రాక్ష మంత్ర గురులింగ మహేశ్వర వీర ప్రసాదములు" అనెడు అష్టావరణములందు ఆసక్తికలిగి, అనాదికాల ప్రవృత్తమైన భ్రాంతిని క్రొద్ది క్రొద్దిగ పోగొట్టుకొనుచు ప్రమాదము లేనివాడై, శివజ్ఞానము కలిగి, శివమయుడై, శివానందమును అనుభవించు సామర్థ్యము కలవాడగును.

నిత్య సత్యాదులచే జీవుడు శివసముడైనను, కించిద్ జ్ఞత్వ-అణుత్వ కర్తృత్వ-భోక్తృత్వాదులతో శివునికంటె వైలక్షణ్యముకలి, అచేతనత్వ భోగత్వాదిలక్షణములుగల జగత్తుకంటె విలక్షణుడు అనుచున్నాడు. శివునకు జగత్కారణత్వము చెప్పబడినను, సర్వజ్ఞత్వాది వైశిష్ట్యమును భవ - శివ - సర్వ - ఈశాన - పశుపతి - రుద్ర - ఉగ్ర - భీమ - మహాదేవాది నామధేయాది కరత్వమునను, స్వరూప లక్షణముగ శ్రీ నీలకంఠ శివాచార్యులు తమ సూత్రభాష్యములో జన్మాద్యధికరణ మునందుపదేశించియుండిరి.

“మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం” మాయ జగమునకు ప్రకృతి కావునను మహేశ్వరుడు మాయ నధిష్ఠించిన వాడగుటను, మహేశ్వరుడు జగమునకు మాయాద్వారా కారణము గాని సాక్షాత్కారము కాదని కొందరి అభిప్రాయము. “కుండకు మట్టి వలె ఉపాదాన కారణమును, కుమ్మరివలె నిమిత్త కారణమును రెండును శివుడే ''అని శ్రుతి - స్మృతి ప్రతిపాదిత మగుటచేత పై వాదమున కవ కాశము లేదు. మహేశ్వరునితో ''అపృథక్'' సిద్ధమగుటచే మాయ జగత్కారణముగ చెప్పబడుచున్నది.

కావున ''మాయ'' స్వతంత్రము అనికాని స్వయంప్రకాశ మానము అని కాని నిరూపింప శక్యముకాదు మహేశ్వరునకును మాయ (శక్తి) కును అవినాభావము ఎడతెగని దగుటచేతను, మాయ విశేషణము మరియు మహేశ్వరుడు విశిష్టమును అనుటచేతను మహే శ్వరుడే జగన్నిమిత్తోపాదానోభయ కారణము అనుచున్నాడని గ్రహింపదగును.

ప్రకృతి ప్రత్యయము లు రెండును కూడి యొకానొక శబ్దమైన టుల శివశక్తులు (మాయా మహేశ్వరులు) రెండును బ్రహ్మపదార్థమగు చుండుటచేత శివభక్తుల నిరూపణ వేరు వేరుగా నావశ్యకమగును

శివుడు జగత్కారణము అని చెప్పు సమయమున శివాధిష్ఠిత యగు మాయకు జగత్కారణత్వము ప్రత్యేకముగ చెప్పనవసరము లేదు. అటు లనే ప్రత్యేకించి వివరణము చేయనవసరము లేదు. మాయా విశిష్ట మహేశ్వరుడే జగత్కారణమని నొక్కి చెప్పు శివాద్వైత సిద్ధాంతములో మాయకు మిథ్యాత్వముగాని మహేశ్వరపృథక్ సిద్ధత్వము కాని ప్రతిపాదించబడి యుండలేదు.

జీవునకు జాగ్రదవస్థవలె స్వప్న మరియు గాఢనిద్రావస్థలును సుషుప్తి) నిత్యానుభూతులై ఫలప్రదములను టచేత సత్యములనియును, సుకృత దుష్కృతములు కల్పాంతమందు కూడ నశింపవనియును, శివ జ్ఞానము గల జీవునకు దేహాంతమునందు శేషించియుండు పుణ్యపాపములు మిత్రులకు శత్రువులకు క్రమముగ సంక్రమించుననియును, - అణుత్వాది ధర్మములుగల జీవుడు ముక్తిదశనొందు తరి శివపద ప్రవేశానంతరము విభుత్వాది సంపన్నుడనియును,- సర్వజ్ఞత్వాది లక్షణములు కలిగియుండుట సగుణత్వమనియును,- క్షుత్పిపాసాది దోషములు లేకుండుట నిర్గుణత్వమనియును,- ఇతరులు చెప్పనట్లుగ సగుణ నిర్గుణ భేదము చేముక్తి రెండు విధములు కానిదై "పునరావృత్తి రహిత శాశ్వత శివసాయుజ్య రూపము" అను ముక్తి ఏకవిధము అనియును.- ముక్తులలో తారతమ్యముగాని, ముక్తునకు శివరూపముగ స్ఫురించుచుండుననియును,- శివతత్త్వము మనోవాచామగోచరమై, బాహ్యేంద్రియాపేక్ష లేనిదై, చిదాకాశ రూపానంద రసాస్వాదలోలమై, అనాదిముక్తమై సృష్టిస్థితిలయములం దేకరూపముగా ప్రకాశించుచుండుననియును,- ఒకపుడు "కరచరణాద్యవయవ సంపన్నరూపములో, మరియొకసారి నాదము - ఆనందము - పరిపూర్ణ జ్ఞానము - విజ్ఞానము గల చేతనుండై భాసించి ప్రకాశించుచుండుననియును - శివసముడను ముక్తినొందినవాడు శరీరిగను అశరీరిగాను బ్రహ్మానందము మరియు శివానందమును అనుభవించుచు శాశ్వతముగ శివపదములో విరాజిల్లుచుండునని శివాద్వైత భావము

ఇచట శివుడే దేవుడు సమానాధిక రహితుడు. సమస్త ప్రాణులకు ఆశ్రయుడు. ప్రాప్యుడు మరియు ప్రాపకుడు శివుడని శివాద్వైత సారాంశము.

శ్రీ నీలకంఠాచార్యులవారు శివాద్వైతములో శివపారమ్యము నిరూపించుటకు గావలసిన ప్రమాణములను కరశార్థములో వ్రాసిరి.

“తద్విష్ణోః పరమరం పరం సదా పశ్యంతి సూరయః” అనునట్లు శివజ్ఞానము కలవారు శ్రేష్ఠమైన శివపదమును చూచి, యానందించి ముక్తినిచెంది, సాయుజ్యము నొందుదురు.

## మహాశివరాత్రి

భారతీయులందరు శివరాత్రిని ఒక మహాపర్వదినముగ భావించి చిత్తశుద్ధితో భక్తి విశ్వాసములతో ఈశ్వరుని ఆరాధింతురు.

సోమవారము అమావాస్యతో కలిసి వచ్చినచో దానిని “సోమవవ అమావాస్య” అని అందురు. ఆరోజు షట్కాల పూజలు చేసుకొని రాత్రి భుజింతురు. అందుకొరకు దానినికూడ “నిత్యపత్రి శివరాత్రి” అని అందురు. ఇదియొక పర్వదినముగ భావించి శివభక్తులగు స్త్రీలు ప్రత్యేకముగ నోములు నోచుకొందురు.

అమావాస్యకు ముందురోజున వచ్చు చతుర్దశిని ‘మాసశివరాత్రి’ అని అందురు. మాఘశుద్ధ పాడ్యమినికూడ “శివరాత్రి” అని కొందరు అందురు.

స్కాందపురాణాంతర్గత శంకర సంహితలో “ప్రతి సంవత్సరము మాఘమాస-బహుళ మందు వచ్చు చతుర్దశిని “మహాశివరాత్రి” అని తెలుపబడినది. ఆబాలగోపాలము మహాశివరాత్రిని సర్వపాపనాశనము గను, భక్తి - ముక్తి ప్రదాయికముగను భావించి, ఉపన్యాసములు చేయుచుందురు.

మహాశివరాత్రిని కొందరు ప్రదోషవ్యాపినిగను, (ప్రదోషవ్యాపినీ గ్రాహ్యాశివరాత్రిః చతుర్థశి రాత్రౌ జాగరణం యస్యాత్తస్మాత్ తాం సముపోషయేత్ - స్మృతీ) మరికొందరు అరరాత్రి, చతుర్థశీ వ్యాపిని గను ("అర్థరాత్రి యుతాయత్ర మాఘకృష్ణ చతుర్దశీ శివరాత్రి వ్రతం తత్రకుర్యా జ్జాగరణం తథా") అనియును చెప్పుచున్నారు. [నారద సంహిత]

మహాశివరాత్రి దినమున అర్థరాత్రి సమయమును, లింగోద్భవ కాలము" అని చెప్పచుందురు. అట్టి సమయమును, ఎవరు అర్థరాత్రి పూజా సమయమున శివలింగ దర్శనము చేయుదురో వారి సర్వపాప ములు నశించును. అని శాస్త్రధర్మము. అట్టి లింగోద్భవకాలమును గూర్చి ఈశాన సంహిత లో "మాఘకృష్ణ చతుర్దశ్యా మాదిదేవో మహానిధిః శివలింగతయోద్భూతః, కోటిసూర్యప్రభః, తత్కాలవ్యాపినీ గ్రాహ్యా శివరాత్రి వ్రతే విధిః" అనియును, మరియొక స్థలములో "అర్దరాత్రౌ దథశ్చోర్థ్వం యుక్తాయత్రి చతుర్థశీ తత్తిథా ఏవ కర్త వ్యం శివరాత్రి వ్రతం వ్రతీ" అనియును చెప్పబడినది.

"అగ్నిపురాణము"లో చతుర్దశ్యాం నిరాహారో యశ్శివం పూజయేత్ శంభుం, వర్ష భోగమ్ ధనాయుష్మాన్ కుర్వాన్ శివచతుర్దశీం అనశ్నన్ పూజయేత్ శంభుం, స్వర్గభయు చతుర్దశీం, ఇహభోగా నవా ప్నోతి, పరత్రచ శుభా శుభం" శివరాత్రిరోజున ఎవరు నిరాహారులై శివలింగమును పూజింతురో వారికి ఇహ పరలోకములందు శుభము శుభము కలుగును.

శివరాత్రి పర్వదినమున హిందువులందరు. ముఖ్యముగ శైవులు తెల వారుఝామున నిద్రనుండి మేల్కాంచి, స్నానసంధ్యాది కార్యము

లను నిర్వహించుకొని, ఉపవాస నిష్ఠను కొనసాగింతురు. ఆ రాత్రి వ్రతమును దీక్షగ నిర్వహించవ సంకల్పించుకొని, శివునా రాధింప నుపక్రమింతురు.

రాత్రిని నాలుగు ఝాములుగ విభజించుకొని శివుని - మొదటి జామున ఈశానునిగను, రెండవ జామున అఘోరుడుగను, మూడవ జామున వామదేవుడుగను, నాల్గవ జామున సద్యోజాతుడుగను సంభావించి నిష్ఠతో ఆరాధింతురు.

### నేపాలలో శివరాత్రి

శివరాత్రి శివునకు ప్రియమైన రాత్రి మాఘ బహుళ మాసములు చతుర్దశి రాత్రి వచ్చును, ఆనాడు ఉపవాసములు - వృత్తము, దీక్షతో సాగించి ఆ రాత్రి నాలుగు జాములుగ విభజింపబడి రాత్రి తెల్లవార్లు భక్తులు మేల్కొని జాగరణమును సాగింతురు.

శివుడు మొదటి జామున ఈశానుడుగను రెండవ జామున అఘోరుడుగను మూడడ జామున వామదేవుడుగను నాల్గవ జామున సద్యోజాతుడుగను ఆరాధింపబడు మయుసటి దానము తెల్లవారుగట్ల పూజ సమాప్తియను నేపాలు ఖట్మండుకు ఆగ్నేయమూలగ 2 మైళ్ళ దూరములో పశుపతినాథ దేవాలయములు, (శివాలయము గలదు). వాగ్మతీ (బాగ్మతీ నదీతీరమున అరణ్యప్రాంతమున నీ శివాలయములో గలదు. వాగ్మతీ బాగ్మతీ నదిని పవిత్ర గంగానది యనియు, ఈ దేవాలయమున్న చోటును వారణాసియనియు పేర్కొందురు ఈ భాగీరథీ నదీతీర దేవాలయమునకు - ఆవలి ఒడ్డున గుహ్యేశ్వరీదేవి ఆలయము గలదు. ఇట జీవబుగ్గ సదా ఉవ్వెత్తుగ మధురజలమును ప్రవహించు

చుండును. ఇది శక్తికి చిహ్నము జలము పవిత్రము. పశుపతినాథుడు తమ నాణ్యములపై ఈ దేవుని ముద్రింనురు. హిందువులు బౌద్ధులు యీ దేవుని పవిత్రవంతముగ నాదించు చుందురు.

“పద్మపురాణాంతర్గత శివగీత” అందు భూతి భూషిత సర్వాంగో యః పూజయతు మాం నిశీ కృష్ణపక్షే విశేషేణ సమే భక్తః సమే [పి] యః, ఏకాదశ్యాముపోష్యైత యః పూజయతి మాం నిశి సోమ వారే విశేషేణ సమే భక్తోన నశ్యతి.”

విభూతిని శరీరమునకు పూసుకొని యెవరు అర్థరాత్రి సమయ మున నా పూజను చేయుదురో వారే నా ప్రియమైన భక్తులయును, సోమవారమునాడు ప్రత్యేకముగ విశేషముంనునవియును చెప్పబడినది. మహాశివరాత్రి రోజున శివుడు బృహల్లింగ స్వరూపమున నుండునని యును, అట్టి సమయమును లింగోద్భవ కాలము” అనియునందురు.

బ్రహ్మ విష్ణువులకు శివస్వరూపమందు సందేహాగలిగి, జ్యోతిర్లిం గము యొక్క ఆద్యంతములను తెలియుటకై కృతనిశ్చయులై, బ్రహ్మ హంస వాహన రూఢుడై ఊర్ధ్వ భాగమువైపునకును, విష్ణువు పాతాళ భాగమువైపుకును బయలుదేరి (యోగశాస్త్రరీత్యా - బ్రహ్మజ్ఞా కులుడై శిరస్సునందలి సహస్రారము వైపు-. విష్ణువు శక్తిస్వరూపుడు అనగ కుండలినీ శక్తిస్వరూపముతో అధోభాగమువైపునకు వెళ్ళు చుందురు) శివలింగముయొక్క ఆద్యంతముల నరయలేక తిరిగి వచ్చి నపుడు విష్ణువు సత్యమ్ము తను శివలింగము యొక్క ఆదిని కనుగొన లేకపోయితినని చెప్పెను.

కాని బ్రహ్మ, కేతకి [మొగిలి] పుష్పమును సాక్ష్యముగ నిడు కొని, తాను స్వయముగ ఉపరిభాగమును చూడనప్పటికిని చూచితినని అసత్యము పలుకుటచేత “బ్రహ్మకును - అతనికి కూట సాక్ష్యమిచ్చిన

మొగలిపువ్వనకును" పూజా నిషిద్ధములుగా నుండునట్లు - శివుడు శాపమిచ్చెను. బ్రహ్మ విష్ణులకును - సమస్త దేవతలకును పరమేశ్వరుడు మహాశివరాత్రి అర్ధరాత్రి సమయమున తేజో లింగరూపమున దర్శనమిచ్చెననియును, లింగ - కూర్మ - శివపురాణాదులు వక్కాణించుచున్నవి.

మహాశివరాత్రి మాహాత్మ్యమును తెలుపు కథ సానందోపాఖ్యానాది గ్రంథములందిట్లు కలదు.

"పూర్వమొక కిరాతుడు వేటను జీవనోపాధిగ జేసికొని నివసించుచుండెను. అతడొక నాడు వేటకు బయలుదేరి, మిక్కిలి శ్రమకు గురియై, విసిగి వేసారి, చీకటిపడు సమయమున నొక కొలను గట్టునకు జేరి కొలనులో నీరు త్రాగుటకువచ్చు జంతువులను చంపుటకై నిశ్చయించుకొని, క్రింది భాగములో వలలుపన్ని, తానచట నొక కంటకావృతమైన వృక్షము నెక్కి కూర్చుండెను. అది హేమంతముతో గూడిన శిశిర ఋతువు కావున కొద్దిగా మంచుపడుచుండెను. అతడపుడు తన దృష్టికి అడ్డమువచ్చు ఆకులను త్రుంచి క్రిందపడవేయుచుండెను ఆ మారేడు ఆకులు చెట్టుక్రిందనున్న శివలింగముపై నా రాత్రి యంతయు పడుచునేయుండెను. ఈ విధముగ నా రాత్రి యంతయు మేల్కొని ఆ కిరాతుడు జాగరణము జేసెను అతడు ఆరోజు ఉదయమునుండియు ఎట్టి ఆహారమును గ్రహింపలేదు. ఇట్లు కిరాతుడు "మహాశివరాత్రి వ్రతములో ముఖ్యమైన నియమముల నన్నిటిని, అనగ "ఉపవాసము - జాగరణము - బిల్వములతో శివపూజ" మున్నగు వానిని తనకు తెలియకుండగనే చక్కగ నాచరించుటచేత శివుడతనికి మోక్షమును ప్రసాదించెను.

ఈ శివరాత్రి నియమములను భక్తులెల్లరు విధిగ నాచరింపవలయును. బ్రాహ్మ ముహూర్తమునందు లేచి, శివనామ స్మరణముతో

స్నానాది కార్యక్రమముల నిర్వహించుకొని, శుచిర్భూతు లగుదురు. "ఓం నమః శివాయ" అను షడక్షరీ మంత్రము నుచ్చరించుచు, విభూతిని "ఫాలము - కంఠము - హృదయము - భుజములు - హస్తములు - ఉదరము - పాదాదులందును, శరీరమందలి ప్రతి కీలుడున్న స్థానమందును, భస్మమును ధరింపవ యును. దీనిని భస్మ త్రిపుండ్ర ప్రితము అని అందురు. అనగ "నా రుద్రోరుద్ర మర్చయేత్" అను నట్లు రుద్రునివలె రుద్రాక్షమాలదులను ధరింపవలయును. "వినాభస్మ త్రిపుండ్రేన, వినా రుద్రాక్షమాలయా, పూజితోపి మహాదేవః నస్యాత్ తస్య ఫలప్రదః" (లింగపురాణము). మహాశివరాత్రి దినమంతయు ఉపవాసమును - నియమయుక్తులై చేసి. సంతత ధారాజలముతో లింగాభిషేకమును చేయవలయును. రాత్రి యంతయు శివనామ కీర్తనలను - మరియు శివకథలను వినుచు జాగరణము చేయవలయును. ఈ విధముగ శివభక్తు లెల్లరు మహాశివరాత్రి వ్రత నియమములను పాటించవలయును. శివుడు మంగళకరుడు. సమస్తలోకములు తలయందు కలవాడు. వికార రహితుడు. సమస్తమైన అజ్ఞానమును మరియు సమస్త దుఃఖములను తొలగించి, ఆనందము నిచ్చువాడు శివుడు. "సత్యం - శివం - సుందరం"ల యొక్క స్వరూపమే శివుడు. "సర్వజ్ఞుడు - సర్వ వ్యాపకుడు - సర్వశక్తిమంతుడు - సాత్వికుడు - నిర్గుణస్వరూపుడు - నిర్వికారుడు - నిరాధారుడు నిరంజనుడు - నిర్వికల్పుడు శివుడు. "సగుణేశ్వరుడు - సర్వభూతాధారుడు - సర్వవ్యాపకుడు - సర్వబాధానివారకుడు శివుడు. "అనిర్వచనీయుడు - ఆనందమయుడు ఈశ్వరుడు" శివుడు.

"ఆత్మారే! ద్రష్టవ్యః శ్రోతవ్యః' అనునట్లు 'వినుచు - స్మరించుచు సంతత ధ్యాన నిమగ్నుడైన భక్తుడు పరమేశ్వరుని దర్శింపగలడు.

"ఈశానః సర్వవిద్యానాం, ఈశ్వరః సర్వభూతానాం, బ్రహ్మాధిపతిః, బ్రహ్మణోధి పతిః బ్రహ్మా సదాశివః' అనునట్లు శివుడు బ్రహ్మ

స్వరూపము. అనగా జ్ఞానస్వరూపము. 'రాత్రి' అనగా ఆనందమును కూర్చునది. శివసంబంధమగు ఆనందమును కూర్చునది శివరాత్రి. "శివస్య ప్రియా రాత్రిః యస్మిన్ వ్రతాంశత్వేన విహితం తద్వ్రతం శివరాత్రి ఆఖ్యం", అని యున్నది. కాన అట్టి యీ మహాశివరాత్రియందు ఇంద్రియ నిగ్రహమును చేసి, జాగరూకులై, శివతత్త్వమును గుర్తించుటకై, అరయుటకై కదా మేల్కాంచి యుండవలయును.

'వ్రతమనగా ఇంద్రియాదులకు బాహ్యవ్యాపారములనుండి అంతర్ముఖులగునట్లు చేయు ఉపవాసాదులతో కూడియుండును. ఆహార పదార్థముల భుజింపకుండుట మాత్రమే ఉపవాసము కాదు. యోగమునందు చెప్పబడినట్లు ప్రత్యాహారమే ఉపవాసము. అట్టి ఈ శివరాత్రి వ్రతమును కృష్ణ చతుర్థశి రోజున నిర్ణయింతురు. అమావాస్యనాడు ఆత్మస్వరూపమగు సూర్యుడు - మనోరూపమగు చంద్రుడు కలిసెడు 'యుగవల్'గ, జ్యోతిశాస్త్రమున పేర్కొనబడుచున్నది. కృష్ణ చతుర్దశిరోజున జీవాత్మ మనస్సుల సంయోగము సన్నిహితమగును. కాని "అమా" ఇందువలె పూర్తికలయిక యుండదు. శివాద్వైతులు చెప్పు" నిత్య - శుద్ధ - బుద్ధ - ముక్త సచ్చిదానందముల స్వరూపములో లీనము చేయబడి "నేతి - నేతి" అను స్థితికి చేర్చుటకు అమా (అమావాస్య) ప్రతీక. కాన పశువాంఛలను వదలి ఇంద్రియాదులద్వార భౌతిక భోగములను మాని, అజ్ఞానాంధకారములోనున్న ఈ సంసారములో మహాశివరాత్రి ఉపవాస వ్రతమును ప్రతి ప్రాణియును చేయవలయును,

"విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ అనాతురం" (యజుర్వేదము) అనునటుల సమస్త ప్రాణులను అనాతురులుగా పుష్టిగ నుండుటకు ఏర్పరచిన శివాలయములలోనికి శివరాత్రి వ్రతముచేయు భక్తులందఱును వెళ్ళి శివారాధనమును చేయవలయును "శంకర సంహిత"యు చెప్పినట్లు విశ్వమంతయు మహాంధకారములో ప్రళయకాలమున నుండెను అప్పుడు

సదసద్గోచర మగుటలేదు. ఆ ప్రళయమునందు సర్వజీవనాశనము జరిగినది. అపుడు పార్వతి హృదయపద్మమున. నిశ్చలభక్తితో సర్వకళాత్మకుఁడైన శివుని ధ్యానించుచుండెను. పునః సృష్టి ప్రారంభమగు సమయములో పార్వతి పరమేశ్వరునితో నిట్లనెను. ఈ శివరాత్రి సమయమున నా హృదయకమలమున నిన్ను నేను ప్రార్థనాదులతో నర్చించుచుంటిని. కాన నిటులనే శివరాత్రిరోజున నిన్నారాధించు భక్తులందఱు ఇహలోక సుఖముల ననుభవించి, శివైక్యము నొందుదురుగాక "అని" పార్వతి అనెను.

మహాశివరాత్రి సమయమున, సర్వభూత గణ పరివృతుడై సమస్త దేవతా సహితుడై, పరమశివుఁడు నృత్యమారంభించెను. అందులకే నృత్యాదులను జూచువారు జ్ఞానజ్యోతిని బడసి, అజ్ఞానాంధకారము నుండి ముక్తులగుదురు. శివానుగ్రహముచేత కుబేరుఁడు దుటీశ్వరుడయ్యెను. వాయువు మొదలగు దేవతలు బలసంపన్నులైరి కల్మాషపాదుఁడు సర్వదోష విముక్తుఁడయ్యెను. 'శివలింగము' రూపమునకు-రూపరహితమునకును సమన్వయ సూచకము. అట్లే సాకార నిరాకారములకు చిహ్నము. "దూర్జటి మహాకవి "నాకన్నారన్ భవదీయరూపు సగుణాకారంబుగాఁ జూపవే! చిన్నీరేజ విహారమత్త మధుపా! శ్రీ కాళహస్తీశ్వరా!" అని పరమేశుని అర్థించెను.

సాధకుఁడు సగుణోపాసనమును చేయుచు, క్రమముగ నిర్గుణోపాసనమును చేయుచు, క్రమముగ నిర్గుణోపాసనము పొందుటకు చిహ్నము శివలింగము. శంకరుని డమరుక శబ్దము నాదమునకు గుర్తు. చంద్రశేఖరుని శిరముపై నున్న చంద్రుడు మనోవిగ్రహాను గ్రహములకు చిహ్నము గంగా జటాజూటునిని గంగ ముక్తికి మరియు పవిత్రతకు గుర్తు. భస్మాంగవేపుని చిదాభస్మము పవిత్రకు చిహ్నము. గజాజిన ధారి యొక్క గజచర్మము గర్వాపహారమునకు గుర్తు. వ్యాఘ్రాసనాసీనుని పెద్దపులి చర్మము కోర్కెల నణచుటకు గుర్తు. నాగభూషణుని సర్ప

ములు జీవాత్మకు చిహ్నములు. సారంగపాణి చేతియందలి జింకయొక్క పాదములు నాలుగు వేదములకు గుర్తు. వృషభవాహనుని నంది సత్సంగమునకు మరియు ధర్మమునకు సూచకము. త్రినేత్రుని మూడవ కన్ను ప్రజ్ఞతకు గుర్తు. అభిషేకప్రియుని జలాభిషేకము నిత్యనిర్మల భక్తికి సూచకము.

పంచామృతాభిషేకము పంచేంద్రియములను ఏకమొనర్చ, శివ పాద పద్మసన్నిధి నిడుటకు గుర్తు. నైవేద్యము ఆత్మార్పణమునకును సాష్టాంగ ప్రణామము అహంకారమును అణచుటకును, ప్రదక్షిణ ఓంకార జపమునకును, హారతి ఆత్మనివేదనమునకును, నృత్యాదులు శక్తి మరియు ఆనందస్వరూపమునకును సూచకములు.

కాన పై విధముగ భావించుచు శివుని సగుణోపాసనను మహాశివరాత్రియందు చేయనగును.

శివారాధకుడు శివరాత్రి రోజుననే గాక ప్రతినిత్యము లింగార్చన సమయములో "తూర్పున తత్పురుష స్వరూపమును - దక్షిణమున అఘోరస్వరూపమును - పశ్చిమమున - సద్యోజాత స్వరూపమును ఉత్తరమున వామదేవస్వరూపమును - ఊర్ధ్వశిరోభాగమున, పరమశివుని మరియు ఈశాన స్వరూపమును గుర్తించి. - అధోభాగమున చిచ్ఛక్తిని గుర్తించి, దేవాలయములలో అఘోర స్వరూపముగు దక్షిణ భాగమున కూర్చుండి శివపూజచేయుట విహితము. "నప్రాచీమగ్రతః శంభోర్నోదీచీం శక్తిసంస్థితాం నప్రతీచీ మతః పృష్ఠం అతో దక్షం సమాశ్రయేత్" శివుడు సంహారకర్త కావున యతనికెదురుగా తూర్పున కూర్చుండరాదు. శక్తికి ఎదురుగను ఉత్తర దిశయందు కూర్చుండరాదు. పృష్టమును చూపునట్టి పశ్చిమదిశయందు కూర్చుండరాదను నిషేధమువలన దక్షిణదిశ సర్వదా - సర్వథా శ్రేయోదాయము.

"సర్వకామప్రదం బిల్వం దారిద్ర్యస్య ప్రణాశనం బిల్వపత్రాత్ పరంనాస్తి యేన తుష్యతి శంకరః" (స్కాందపురాణము) కాన బిల్వ పత్రాదులచే మహాశివరాత్రి పర్వదినమున శివలింగార్చన చేయవల యును.

"ఏకాదశీ కోటి కృతేచ యత్ఫలం
వారణాసీ స్నాన సహస్ర నక్తైః
జన్మాష్టమీ లక్ష భవంచ సిద్ధేత్
ఏకేక సత్యం శివరాత్రికేన."

అను స్కాందోక్తమగు మహాశివరాత్రి వ్రతము సర్వపుణ్య ప్రదాయ కము.

## శైవగణార్చన

'శైవగణార్చన' "గురుచరేశ్వరా రాధన" రూపమైనది. "ఇది "నక్త" వ్రతము, కార్తీకమాసమందు శైవులు ముఖ్యముగ నీ వ్రతమును ఆచరింతురు.

శివపురాణమందలి - విశ్వేశ్వర సంహితలో "కార్తిక మాసము రాగానే దేవతలందరిని పూజింపవలయును, కార్తీకమాసము న దేవ పూజ సర్వభోగ ప్రదమగుటచే కార్తీకమాసములో దేవయజనము శ్రేష్ఠమైనది' అని తెలుపబడినది.

కాశీఖండములో "ఏ మూఢచిత్తులకు కార్తీకమాసము వ్రత హీతముగ గడచునో అట్టివారు సూకరములవలె నిరర్థక జన్మగలవారు గాన వారికి పుణ్యము లేశముకూడ అంటదు." కాన కార్తీకమాస మున నక్త వ్రతానుష్ఠానము అనివార్యముగ నేర్పడుచున్నది.

శివపురాణమునందలి - ధర్మసంహితలో "సర్వవిధముల పక్వము చేయుపడిన అన్నమును శివునకు నివేదించి, అగ్నియందు హోమము

చేయవలయును. ఇటులే గురువునకు నొసంగుచుండవలయును. ఎవ్వరు ప్రతిదినము సర్వవిధముల పక్వాన్నములోని అగ్రభాగమును "శివునకు అగ్నికి - గురువునకు - మహేశ్వరుడగు విప్రునకు" ఒసంగి భుజించునో వాఁడు కేవలము రుద్రుఁడే అగును. ఆ విధముగ పై నల్వురకు నొసంగక భుజించువాఁడు కేవలము పాపములనే భుజించువాఁడగును." అని తెలుపుటచేత గురుచరేశ్వరారాధనము నిత్యవ్రతముగ నేర్పడెనని తలంచిరి. ఇట్టి ఉత్తమ వ్రతమును సమర్థులగువారు నిత్యము నాచరించిరి. అటుల నిత్యము జరుపుశక్తి చాలనివాఁడు ఇష్టలింగమునందే త్రివిధ భావనతో నీ వ్రతమును జరుపుకొనుచు కార్తీకమాసమున నీ వ్రతమును సాంగముగ జరుపుచున్నారు. ఇది శిష్టాచార సంప్రాప్తము.

కార్తీకమాస వ్రతానుష్ఠానపరులు నెల రోజులు రాత్రియందే గురుచరేశ్వరారాధన గావించి, గురుప్రసాదమును స్వీకరించి, తదుపరి భుజింతురు. పగలు నిత్యకర్మానుష్ఠానముల దీర్చుకొని శివపంచాక్షరీ జపానుష్ఠానమును చేసికొందురు.

ఈ విషయము స్కాందపురాణములోని సూత సంహితయందు ప్రతిపాదింపఁబడినది. అట్టి సూతసంహితను శ్రీ ఆదిశంకరాచార్యుల వారు పదునెనిమిది మారులు మననముచేసి, సర్వవేదార్థ సంగ్రహరూపమైన "శారీరక మీమాంస" భాష్యమును రచించిరందురు. అట్టి సూత సంహిత యజ్ఞవైభవ ఖండములలో 34-వ అధ్యాయమున "పరమేశ్వరుని అనుగ్రహము కోరినవారు నిర్మలచిత్తులై, గురుభక్తియుతులై, ధనము మున్నగువానిచే గురుని ప్రతిదినము పూజింపవలయును." అని "గురుపూజ నిత్యము"గ తెలుపబడినది.

సూతసంహితలోని బ్రహ్మగీత 12-వ అధ్యాయములో "సర్వకాల సర్వావస్థలయందును, సర్వప్రయత్నములతో గురుని అభీష్టమును నెరవేరు చుండవలయును. తనకిష్టముకాని దిగతోచినదైనను గురువు

చెప్పిన విధముగ పనిచేయువాఁడు ముక్తిని పొందును. స్వాశ్రమమును స్వకీర్తిని, స్వాదృష్టమును, లోకవిరోధమును, బంధుపుత్రాదులను, గృహక్షేత్ర ధనాదులను, నష్ట - కష్ట - సుఖములను దేనిని లెక్క-చేయక గురుని అభీష్టమును నెరవేర్చుచుండవలయును.'

"గురువు సంతసించినచో శివుఁడు ప్రసన్నుఁడగును. గురుని దేహమునందు మహాదేవుఁడు డెల్లప్పుడును సన్నిహితుఁడై యుండును. దానివలన తెలియకకూడ గురువునకు అసమ్మతమగు పని చేయరాదు. అటులచేసిన వ్యక్తి ప్రపంచ మందెల్లప్డు నరకమువంటి కష్టముల ననుభవించును. "శివుఁడు కోపించిన గురువు రక్షించును. కాని గురువు కోపించునెడ రక్షించువారు లేరు. కావున మనోవాక్కాయ కర్మములచే గురువున కిష్టమైన పనిని చేయుచుండవలయును.

కాన గురుచరేశ్వరపూజ ముఖ్యము. ౹ మధ్వాచార్యులవారు "పరాశరమాధవీయము" నందు గురుపూజా ప్రకరణలో" గురునికూడ దేవునివలె పూజింపవలయును, (దేవానాం చేతి చకారరేణ గురుం సముచ్చినోతి. గురోరపి దేవతావత్పూజనీయ త్వాల్) కాన ఎవరికి దేవునియందు అధికభక్తిగలదో, దేవునందువలెనే గురువునందును అధిక భక్తిగలిగియుండునో అట్టివానికి వేదాంతార్థమును బోధింపవలయును." అని వివరించిరి.

"శివ" పురాణమునందు గురువే శివుఁడగును. (యోగురుః సశివ. (ప్రోక్తః) శివునకును - పంచాక్షరీ మంత్రమునకును - గురువునకును భేదము లేదు. ఎవరికి శివ - మంత్ర - గురువునందు సమానమైన భక్తి యుండునో వారికి మంత్రసిద్ధి, భోగమోక్షములును శీఘ్రముగ చేకూరును." అని యున్నది.

"సాధకుఁడు మాతృభక్తిచే నీలోకమును, పితృభక్తిచే స్వర్లోకమును, గురుభక్తిచే బ్రహ్మలోకమును పొందును. పితృమాతృ గురు

భక్తి ఎవరికి కలదో వారికి సకల ధర్మంబులు లభించును. పితృమాతృ గురుభక్తిలేని మనుష్యుడు చేయు సకలధర్మములు మరియు ధ్యానములు నిరర్థకములు"

పై విషయముల నవగాహనము జేసికొనినచో గురుచరేశ్వర పూజలో గురుపూజ అవశ్యకర్తవ్యమని, అది సర్వసమ్మతమనియు దెలియుచున్నది. చరులనగ శివభక్తులు. రుద్రస్వరూపులు. సూతసంహిత - శివమాహాత్మ్య ఖండము - ఆరవ అధ్యాయములో"

శివభక్తులనెట్లు పూజింపవలయును ? దాని ఫలమేమి ? అని నైమిశారణ్యవాసు లడుగగ సూతుడు "ఏవిధముగనైనను శివభక్తునకు మనస్తృప్తిని కలిగించుటయే శివభక్తిపూజ. శివభక్తునకు పాద ప్రక్షాళనము జేయుట ధన - వస్త్ర - భూమి - గో - తిల - జలపాత్ర- గృహాదులను ఇచ్చుట శివభక్తపూజ యగును. అని వృద్ధాచల క్షేత్రమునందు ఒక పాపి శివభక్తులకు సేవ మరియు వృద్ధాచలేశ్వరుని పూజచేయుటవలన పాపవిముక్తియేగాక సర్వరోగ విముక్తియు బొందెనని చెప్పెను.

ధర్మసంగ్రహమున ఆహ్నిక కాండయందు శివపూజ నిత్యమని విపులముగ నిరూపింపఁబడినది.

శరీరసంబంధమైన తపస్సు అనగ దేవద్విజ గురుప్రాజ్ఞులను పూజించుటయు, తీర్థస్నానాదికము, బ్రహ్మచర్యము, అహింస అని తెలుపబడుచున్నది. అనగ "గురుచరేశ్వరపూజ" "శరీరక తపము" అని అది సర్వధర్మోత్తమ మనియు తెలియుచున్నది.

మంత్రానుష్ఠానమువలనను, శివభక్తులను మాహేశ్వరులకు భోజనమిడి తృప్తులజేయుటచేతను, గురుచరేశ్వరారాధనమువలనను, తీర్థప్రసాద గ్రహణమువలనను, గణార్చనా ప్రతిష్ఠను తాను పునీతుడై పరులను తరింపజేయగలడు.

బసవేశ్వరుడు - పం డితారాధ్య శంకరారాధ్యులు - కోడిమేల బసవారాధ్యులు మున్నగు వారెందరో గణార్చనా వ్రతమును భక్త్యుత్సాహములతో నెరవేర్చిరి.

## "శివతాండవము"

భారతీయులను జ్యోతిష ఖగోళ శాస్త్రజ్ఞులు ఖగోళము ఒక గగనమండలరాశి చక్రముగ సంభావించిరి. దీనికి వెలుపల చుట్టును సూర్యచంద్రాది గ్రహములు పర్యటించుచున్నట్లున్నదని తెలిపిరి. సూర్యుడు తొమ్మిదవ రాశియగు ధనుస్సు రాశియందు, ఆర్ద్రి నక్షత్రమునందు చంద్రుడు ఉన్నదినము భారతీయులకు మహాపర్వదినము. ఈ పవిత్రదినమున, ఈ పుణ్యదినమున శివుడు నటరాజుగ తాండవము చేసెను. తదాది ముఖ్యముగ శివాలయములలో ప్రతిష్ఠింప బడిన అట్టి అర్చావిగ్రహములనుగాంచి - శివశరణులు చిత్తశుద్ధితో నిశ్చలభక్తితో - తదేకదీక్షతో నా విగ్రహములను ఆరాధింతురు. "ఈ పర్వదినమున శంభువు సర్వలోక సంరక్షణార్థము ఆనందతాండవము గావించుచుండును." అని శంకర సంహిత తెలుపుచున్నది.

"అస్మిన్ రుద్రతిథౌ శంభుః పరమానంద నిర్భరః
సర్వేషామపి రక్షార్థం కరోత్యానంద తాండవమ్"

"శంకర సంహిత"

శివుడు "మంగళకరుడు - లోకేశ్వరుడు - సర్వేశ్వరుడు - విశ్వేశ్వరుడు." శివతాండవము నాట్యములందు పరాకాష్ఠగ చెప్పదగినది. పరమ పాశుపత దీక్షావ్రతుడగు రావణుడు "తాండవశ్శివః" అని ప్రార్థించి, పూజావసాన సమయమున శివానందమును కలిగింప ప్రార్థించెను. అట్టి పరమశివుడు చేసిన అనన్యమగు నీ ఆనంద తాండవమును దర్శించిన సంసార సాగర తరణముతో బాటు, శివసాన్నిధ్యము సులభమని "హాలాస్య మాహాత్మ్యము" నందు తెలుపబడినది.

మంజుకేశాది విప్రులు నిశ్చల భక్తితో పవిత్రహృదయముతో శివతాండవమును జూచి సర్వపాపములనుండి ముక్తిబొందిరి. పతంజలి మహర్షి మరియు కర్కోటకుడను సర్పరాజు శివతాండవమును జూచి శివానందమును బొందిరి. "విహిత కిల్బిషో విప్రో జీవన్ముక్తో బభూవహి. పతంజలి ర్మహా యోగీ, కర్కోటకోపి మహోరగః" (శంకర సంహిత).

భారతదేశము లలితకళల భాండాగారముగ, నిధిగ ప్రసిద్ధిగాంచినది. సర్వకళలకు శివుడు సృష్టికర్త. శివుడు సిద్ధపురుషుడుగ తమిళనాడు నందలి మధురైలో నవతరించి అరువదినాలుగు శివలీలలను చతుష్షష్టి కళలుగ ప్రదర్శించెనని ప్రతీతి.

అంబికాపతి శివుడు "నాట్యసిద్ధుడుగ - వర్తస్త ప్రవీణుడుగ - మహాతాండవ పండితుడు"గను కీర్తింపబడుచున్నాడు. సర్వనాట్య కార్యకలాపములకు కేంద్రమైన సమస్తవిశ్వము ఒక నాటకరంగము. ఈ కేంద్రమున శివుడు" "నటుడు - పాత్రధారి నాట్యచక్రవర్తి." శివుడు దివ్యతాండవమును ఈ రంగస్థలిలోనే హృదయాంతర సీమగ జేసెను. ఈ తాండవమునకు రంగభూమియగు చిదంబరము శివుని - వేదవేత్తలకు వేద్యమగు అనుభూతిశాలిగ ప్రసిద్ధము. ఇచట శివుడు నాట్యమాడి జీవులకు మోక్షము కటాక్షించును.

శివతాండవ మహాత్మ్యము "చిదంబర"మ్ముమ్మని కోవై - తిరుమూలారి తిరుమంత్రం" - "ఉన్మై విలక్కం" - శివజ్ఞాన సిద్ధియరు - అను గ్రంథములలో వివరించి విపులీకరించ బడినది.

నమశ్శివాయ" అను పంచాక్షరీ తత్త్వము - పంచభూతాత్మకము, అందుండి అవమూర్తి స్వరూపమగు శివనృత్యము యొక్క బాహ్యస్వరూప శబ్ద సంపుటిగ 'ఉన్మై విలక్కం'లో వివరింపబడినది. ఇట్టి యుపాసనము ఉపాసకులకు ద్వంద్వాతీత శక్తిస్థితినిచ్చి "శివమను మంగళము"ను చేకూర్చునని తెలుపబడినది.

శివుని నృత్యావసానమున నటరాజు తన ఢక్కాను పదునాలుగు సార్లు మోగించెను. అప్పుడుద్భవించిన శబ్దమును గ్రహించి, విశ్లేషణను చేసి మహర్షులగు శబ్దశాస్త్ర వేత్తలు వ్యాకరణ సూత్రముల”ను రూపొందించిరి.

“నృత్తావసానే (సంధ్యావసానే) నటరాజరాజో ననాద ఢక్కాం నవపంచవారం; ఉద్ధర్తు కామః సనకాది సిద్ధానేతద్విమర్శే శివసూత్ర జాలమ్”

శివుడు సంధ్యాకాలమున నృత్యముజేయునను విషయము కైలాస శైలభవనే త్రిజగజ్జనిత్రీం, గౌరీం నివేశ్య కనకాంచిత రత్నపీఠే నృత్యం విధాతు మభివాంఛతి శూలపాణౌ దేవాః ప్రదోష సమయేను భజంతి సర్వే.” అని శివప్రదోషమున తెలుపబడినది. వాగ్దేవి భారతి ధృతవల్లకియై, శతమఖుడు వేణుధారియై నిశాకరుడు తాళధారియై, భగవతి రమాదేవి గేయప్రయోగాన్వితయై, సాంద్ర మృదంగ వాదన పటుత్వము కలిగిన విష్ణువు మృదంగ ధారియై దేవతలందరు రంగస్థలమందు అంతట నిండియుండగ మృడానీపతిచేయు తాండవమును ప్రదోష సమయమునజూచి, గంధర్వాది త్రిలోకవాసులగు భూతవర్గములు శివైక్యము నొందిరని పురాణమునందు వర్ణింపబడినది.

సర్వప్రపంచ సృష్టి స్పందన చైతన్యస్వరూప శివనృత్యము. బ్రహ్మాండమందలి సర్వము అనంతముగ వివిధ భంగిమలలో కదులుచుండును. ‘జీవకోటికి ముక్తినొసగెడి సంహార క్రియకు గుర్తు ప్రళయ తాండవము.

ఓంకార కళాస్వరూపుడు - గంగాజటాజూటుడు - తారాపతి కిరీటుడు - భృంగీశ సంగీత భంగివిరాజాట స్వరూపుడు” - తాండవ శివుడు.

“ఓంకార వాక్యం, ఉరగపుంగవ భూషితాంగం వ్యాఘ్రాజినాంబరధర, జటినం త్రినేత్రం, పాశాంకుశధరం, అభయవరప్రదం,

శూలపాణిం, కైలాస భూధరపతిం, ప్రణతో౽స్మి నిత్యం" - 'శివం-శంకరం' అని నృత్యాచార్యులు భారతదేశములో తాండవశివుని కీర్తింతురు. 'బధ్నన్ నృత్తాంతరాంతః ప్రగళిత మహినా కల్పితం పట్టబంధం, సంబాధోద్భిన్న ఘోరస్వశిత హుతవహోద్దీప్తి దంష్ట్రా వికటంకం, ప్రోత్తాల స్వైర ధీరైః పదయుగల మహాస్ఫోటనైః కల్పయంతః నానాభంగాన్ లయాబ్ధౌ భ్రుకుటింత నిటలం శూలినం సంస్మరామః" అనియును, నటరాజును స్మరించుచుందురు.

ధర్మచక్రవర్తనమున జరుగు జగన్నాటక సూత్రధారి,- భువనములకే నవగతుడు, మధురనటనాచరణుడు,- నటజీవన నాట్యధురీణుడు ప్రళయతాండవ నటుడు,- పరమశివుడు అనవరతము అమరత్వమును కలుగ జేయుటకై శివుడు తాండవమాడును. శివా (పార్వతి) లాస్యము సుకుమారముగ జేయును. శివతాండవము "ఆరభటీ వృత్తి"తో కూడుకొనినదై యుద్ధృతముగా నుండును ఈ నృత్యముచేయు నటరాజుయొక్క హస్తములలో, రక్షణకు సూచకమగు అభయముద్ర అను ఢక్క అజ్ఞానమును అంతరింపజేయు అగ్ని. సర్వతోవ నివారిణి అగు అనుగ్రహములున్నవి.

1. డమరుక నాదము :- శివనృత్య దర్శనమునకై ఉదారముగ జీవులనెల్ల పిలుచుచు, శుభంకరాహ్వానమునిది సూచించును. అవ్యక్తమగు సృష్టి వ్యక్తమగుట యిందలి ధర్మము.

2. అభయానుగ్రహము :- స్థితికి చిహ్నమై రక్షణమును వ్యక్తీకరించును. శుభప్రసాద చిహ్నముగ దీనిని గ్రహింతురు.

3. అగ్ని :- ప్రళయమునకు చిహ్నము అగ్ని. శివానుగ్రహమున భక్తులెల్లరు మహానందమును పొందెదరు.

ఆగమశాస్త్రములందు శివుని నాట్యము మూవిధములుగ జెప్పబడినది.

1. సంధ్యానాట్యము - "స్కాందపురాణము"న "శివప్రదోష

స్తోత్రము"నందు రత్న రాసులతో నలంకరింపబడి, స్వర్ణ సింహాసనముపై పార్వతి అధిష్ఠించియుండగ, త్రిశూలపాణియగు శివుడు నాట్యము చేయ సురలు దర్శింతురు" అని వ్రాయబడినది.

2. శ్మశాన నాట్యము :- శివుడు అర్థరాత్రి శ్మశానములో (ఆనందకాననము) కావించు నాట్యము. ఇది తామసికము కాని అహంకార నిర్మూలన సూచకము.

3. నాదాంత నాట్యము :- ఇది సాత్త్వికము. చిదంబరములో (తిల్లై) శివుడుచేయు నీ నాట్యము భగవదనుభూతి ప్రసాదించును, అందుచేత దీనిని "ఆనందతాండవము" అని అందురు.

నటరాజ రూపము :- నటరాజరూపమున శివునకు నాలుగు హస్తము లుండును. అపుడు వామహస్తము "దండ" లేక 'గజహస్త' ముద్రను, దక్షిణహస్తము "అభయముద్ర"ను. ముంజేతుల సర్పవలయ మును (కంకణములు) కుడిచేత డమరుకమును ధరించును. కుడికాలు కొంచెము వంచబడి "అపస్మార పురుషు"ని వీపుపై నుంచబడును. శివునిచే నణగద్రొక్కబడిన అపస్మార పురుషుని శిరము కుడిప్రక్కగ- పాదములు ఎడమవైపుగ నుండును. పాము పడగ యాకారమును సూచించునట్లు చేతివ్రేళ్ళు గిన్నెరూపములో నుండ, తత్సర్ప ఫణి యాకృతి కర్మపాశమును సూచించును. "పార్వతీపతి తెలుపు" అను వట్లుగ నున్న శివుని శ్వేతవర్ణము సాత్త్వికమునకు చిహ్నము. తామసిక చిహ్నమగు అపస్మార పురుషుని నల్లపురంగు మతిభ్రమణము మఱపునకు సూచకము.

"సూతసంహిత" "శివతాండవ" కథ కలదు. ప్రజాపతి దక్ష సభాపతి యగు శివుని ఆరాధింపుడని దేవతలను నియమించెను. శివుడు అవిద్యా పంచకమునకు చిహ్నమగు "అపస్మార పురుషు"ని తన పాదముక్రింద వైచి త్రొక్కెను. బ్రహ్మము (జ్ఞానము) ఈ అపస్మార

పురుషుని తన మాయనుండి సృష్టించి, దాని నాశనమునకు మార్గమును ఏర్పఱిచెను.

శివనృత్యమునకు మూలకారణముగ చెప్పఁగొను కథయిది. "విశ్వమును రూపుమాపు వరప్రసాదము కొఱకు బ్రహ్మను ఒక రాక్షసుడు ప్రార్థింప అట్లు చేయ నిష్టములేని బ్రహ్మ దీనికి తటపటాయించెను. దేవతలు శివునియొద్దకు వెళ్ళి రక్షణకోరి శివశరణులైరి. విశ్వరక్షణార్థము శివుడు ఈ నృత్యమును కావించుచుండగ. అందరును శివతాండవమునుగాంచి, కాలవిస్మరణము జేయగ భూతములుకూడ కాలవిస్మరణము ను చేసికొనిరి. ఇంతలో బ్రహ్మరాక్షసున కివ్వదలసిన వరసమయము గతించెను. తన కాకాసి వరములు లభింపకపోవుటచే నా దానవుడు కృశించెను. అపుడు విశ్వము రక్షింపబడెను. అని పుష్పదంతాదుల శివమహిమ్నాది స్తోత్రగ్రంథములందు వివరింపబడినది.

దీనికి సంబంధించిన మఱొక కథ కలదు. "విష్ణువు స్త్రీ రూపము దాల్చి విశ్వరక్షణార్థమై శివునివెంట తాపసులవద్దకు వెళ్ళినట. శివునకును ఋషులకువచ్చిన తగవులో ఋషులు శివుని సంహరింపదలచి మంత్ర తంత్రాదులతో తా మారాధించు "అగ్ని"నుండి పెద్దపులిని (శార్దూలము) సృష్టింపగ శివుడద్దానిని సంహరించి, దాని చర్మము తీసి ధరించెనట. తాపసులు కినుకతో నంతటితో నాగక ""నాగుబాము"ను శివునిపై ప్రయోగింపగ శివుడు దానిని గ్రహించి, తన యాభరణముగ ధరించి "నాగభూషణుడు ఆయ్యెను. అంతట శివుడు నృత్యమారంభింప నా మునులు మరుగుజ్జగనున్న "అపస్మారపురుషుని శివునిపైకి పంపగ శివుడు వాని వీపుపై బొటనివ్రేలితో నొక్కి వెన్నెముకను విరగద్రొక్కి, యథారీతిగ నటరాజు నృత్యము జేయు దేవతలందరుచూచి సంతసమందిరి, తాపసులకు, తాపనివృత్తియై శివానందము పొందిరి.

అర్ధరాత్రి సమయమున, శ్మశానమున, సమస్తభూతగణ పరివృతుడై శివుడు కావించు నాట్యము తామసికము, ఇది అహంకార నిర్మూలన సూచనము. అనగ ప్రళయ సమయమున లోకవాసులు తమ్ముదాము గుర్తింపుకొనలేని సమయమున, అహంకార నివృత్తి సూచకముగు తామసిక తాండవమే శివనాట్యము.

శివుడు నాట్యమున పంచభూతాత్మకముగు పంచకృత్యములను కావించును. అవియే "సృష్టి - స్థితి (రక్షణ) - లయము (నాశనము, సంహారము) - తిరోభావము లేక తిరోధానము (మాయ) - అనుగ్రహము. (ముక్తి, కైవల్యము, లింగైక్యము) మున్నగునవి," సద్యోజాత - వామదేవ - అఘోర - తత్పురుష - ఈశాన రూపములలో నుండి చేయు సదాశివ చర్యలు.

నటరాజ ముద్రిలగూర్చి శైవాగమములు భిన్నరీతులలో దెలుపుచున్నవి. ఢక్క - సృష్టిని; అభయము - ఆశను మరియు విశ్వాసమును; అగ్ని - మరణమును; పైకి ఎత్తబడిన నాలుగవ చెయ్యి-రక్షణ రూపసహాయమును; సూచించును.

"పృథివి - అప్ - అగ్ని - వాయు - ఆకాశరూప పంచభూతాత్మకముగు "పంచాక్షరి" మంత్రముకూడ ఢక్కగల హస్తము 'శి'-ని; ముందుకు సాగబడిన హస్తము - 'నా'-ను; అభయహస్తము - "య"-ను; అగ్నిగల హస్తము - "న"ను; అపస్మార పురుషుని నణగ ద్రొక్కు పాదము-" మః -'ను, సూచించును. ఈ పంచాక్షరిలోని యక్షరములు 'న'=మలముయొక్క; "మః"=తిరోభావమై; "శి+వా+య" = చూచి యానందించు జీవాత్మను సూచించును.

శివునియొక్క నవ తత్త్వములలో "హిరణ్యగర్భ- విష్ణు - హర ఈశ్వర - సదాశివ - బిందు - నాద - శక్తి - శివ" మూర్తులన్నింటికి మూలకారణమై, మిన్నయై, వెలుగొందువాడు తాండవ శివుడు.

అనగ "సత్యస్వరూపములగు శివతత్త్వముల కన్నింటికి ఆనందతాండవ మూర్తి యొక్క తత్త్వమే పునాది.

పతంజలిమహర్షి "హాలాస్య మాహాత్మ్యములో" ఈ నాట్యకళ మహాద్భుతము. భక్తునకు నుత్తమగతిని మరియు జీవిత నిర్వాహణ ములనందించుటలో నీ నాట్యకళ తోడ్పడును. కదంబారణ్యములో సాక్షాత్తు శివుడే తాండవమును ప్రదర్శించును."

భరతముని నాలుగు వేదముల నాధారముగ గ్రహించి, "నాట్య శాస్త్రము"ను రచించెను. "ఋగ్వేదమునుండి పాఠ్యము: సామ వేదమునుండి గీతము, యజుర్వేదమునుండి అభినయము; అథర్వ వేదమునుండి రసములను" గ్రహించి "భరతశాస్త్రము"ను సృష్టించెను. శివుడు భీకర తాండవమును, శివ (పార్వతి) అహ్లాదకర లాస్యమును అర్థనారీశ్వర రూపమున జేరిరి. "తాళము" = కాలమునకు కొలబద్ద. అనగా "తా" = శివతాండవముదు; "ల" = పార్వతిలాస్యమును సూచించును. ఇట్టి నృత్యాదులు గానము మరియు వాద్యాదులతో ప్రారంభింతురు.

నటరాజ నృత్యనటనలు ఆ వేళ సూచికములు. భారతీయులు సంగీతమునకు "నృత్యము 'జీవనము' ఆయువుపట్టు" అని అందురు.

శైవాగమములలో పేర్కొనిన నూటయెనిమిది నృత్యములు భరతనాట్య శాస్త్రములో పేర్కొనబడినవి. ఇందు మొదటిది సమస్త దేవాలయములలో శిల్పరూపముననున్న నటరాజనృత్యము, భిన్న భిన్న శివనృత్య రూపములన్నియును చిదంబరములోని శివాలయ గోపురములపై ప్రదర్శింపబడుచున్నవి. నటరాజ నాట్యము జీవిత నిర్వాహణ మార్గసూచకము. ముక్తినిచ్చి "శివానంద" మివ్వగలదు.

## శివుని నృత్యములు దశవిధములు

1. ఆనందతాండవము :- విశాల విశ్వమొక మహానాటకరంగ

గము. ఇందు ప్రతిజీవియు తన పాత్రను నిర్వహించుచుండును. పాత్ర ధారులగు నటకులందఱను సమన్వయము చేయువాడు సూత్రధారి. అట్టి నటసూత్రధారియే పరమేశ్వరుడు. అతడే రుద్రుడు. అతడు కైలాస పర్వతముపై నధిష్టించిన దేవదేవుడు

వ్యాఘ్రపాదుడను మహర్షి "తిల్లై" వనమున (చిదంబరము) శివ లింగమునకు పూజలుచేయుచుండెను. ఇచట నొక సాంప్రదాయ కథ ప్రచారమునందుగలదు. శివుడు - పార్వతీ సమేతుడైయున్న సమయ మున వ్యాఘ్రపాదమహర్షి పరమేశ్వరుని, దర్శించి, 'నీ పవిత్ర నృత్య ముతో లోకమును హర్షింపజేయుము, ప్రజల నానందపరవశుల గావిం పుము. అని కోరెను. ఆ మహర్షి తనకు జేసిన పూజలకు సంతసించి, శివుడాతని కోర్కెదీర్చుటకై, ప్రజలను రంజింపజేయుటకై తిల్లైవన ములో, మకరమాస పుష్యనక్షత్రముతో గూడిన బుధవారపు దివసమున నృత్యమును గావింతునని" అపనికి చెప్పెను. శివుడు కావించిన ఈ నృత్యమును "ఆనందతాండవము" అని అందురు. ఈ నృత్యమును శివుడు బ్రహ్మముహూర్తమున గావించి, సర్వప్రాణుల నాశీర్వదించెను. ఈ నృత్యము ప్రతిసంవత్సరము మార్గశిర మాసములో ఆరుద్ర నక్షత్ర యుక్త దినమున చిదంబరములోని, నటరాజదేవాలయములో, నటరాజ చిత్సభామంటపమున ప్రదర్శింపబడుచుండును.

2. ఊర్ధ్వతాండవము :- శివుడు ప్రతిరోజు మానవులను సంత సింపజేయుటకై చిదంబరములో [తిల్లై] ఊర్ధ్వతాండవము చేయుచుం డెను. అట్టి తాండవ శివస్వరూపము "ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయ వైనమో నమః" అను శ్రుతివర్ణితమువలె నుండును.

3. కాళీ నృత్యము - ఈశ్వరుని ఊర్ధ్వతాండవ నృత్యమును గాం చిన దుర్గాదేవి ఈర్షతో శివునితో పోటీగ నృత్యమొనర్చెను. అపుడు ఈశ్వరుడు కాళీనృత్యము చేయగ దుర్గాదేవి నృత్యములో ఓటమిని పొందెను.

4. గౌరీనృత్యము :- శివుడు హిమవంతుని కుమార్తెయగు పార్వతిని వివాహమాడెను. ఆమెను సందోషపెట్టుటకై తన ఆనంద నృత్యములో దృష్టి జెందక, ఆ హైమవతి సన్నిధిలో గౌరీనృత్యమును కావించెను.

5. సంధ్యా తాండవనృత్యము :- ప్రతి త్రయోదశి దినమున సాయం సమయమును "ప్రదోష సమయము" అని అందురు. ఆ రోజున సాయం సమయములో శివుడు తన యుత్సాహసమయమున, ఋషభ వాహనుడై బాహ్య విశాలప్రాంతములందు బయనించుచు, విశ్వమందుగల సర్వానర్థములను పారద్రోలుచుండును. శివుని యొక్క యీ యుత్సవము నేటికిని ప్రదోష సమయములలో శివా యములందు చేయుచుందురు. శివుడు ప్రదోషదినములలో సంధ్యా తాండవమును గావించుచు విశ్వమందుగల సర్వదోషములను పైదొలగించుచుండును. అటులనే ఆయా దోషములను గావించు వారిని కూడ పారద్రోలుచుండును.

ఈ నృత్యము దృష్టులను పరిపూర్ణముగ నాకర్షించును. చూపరులను వశులను గావించును, సర్వేంద్రియములను రంజిల్ల జేసి, ఆనందమును, హాయిని చూచువారికి చేకూర్చును నేటికిని దక్షిణాది శిల్పులు దీనిని శిల్పరూపమున, చక్కగ శిల్పించి - ప్రదర్శించు నైపుణ్యమును కలిగియున్నారు.

అట్టి శక్తిమంతులు, ధీమంతులు, నేర్పరులునైన శిల్పులు నేటికిని విశ్వవిఖ్యాతిని బడయుచున్న శిల్పములను నిర్మించుచునేయున్నారు.

6 ముని నృత్యతాండవము ;- ప్రాచీనకాలమున కొందరు ఋషులు కర్మకాండకు ప్రాధాన్యము నొసంగి, అందు లీనమై దానినే ప్రశంసించుచుండెడివారు. అట్టి వారిలో కొందరు జ్ఞానకాండను మరియు వేదాంత భాగమును పూర్తిగ విస్మరించెడివారు. పై ఋషు లవలంబించుచున్న వక్రమార్గములను శివుడు గర్హించి, వారిని, సక్రమమార్గ

మున నడుపతలంచెను. వారిని తనవద్దకు ఆహ్వానించి, ఏబది వేలకు పైగ నున్న ఋషిగణముల మనస్సుల నావరించియున్న అజ్ఞానమును బాపి ద్రోలుటకు "మునినృత్య నాట్యము"ను గావించెను.

7. సంహార తాండవము :- సంసార సాగరమునందు సుఖదుఃఖములు రెండును అంతరించు నొక దినముకలదు. ఆరోజున జీవిత నాటకములతో విశ్వమంతరించును. ఇదే లయదినము లేక సంహారదినము. మహాప్రళయదినమున శివుడు ఏకాకిగ నుండును. ఈ లయస్థితిలో శివుడు తన్ను దప్ప మఱి దేనిని గాంచడు. సుఖదుఃఖము లుండవు. అపుడు శివుడు సంహార తాండవమును చేయుచుండును.

8) త్రిపురసంహార తాండవము : ఒకపుడు "త్రిపురా సురులు" అనబడు ముగ్గురు రాక్షసులు వరముల బలముచే దేవతలను, సర్వలోకములను హింసించుచుండిరి. వీరి నణచుటకు శివుడు దేవగణములను మరియు ఋషిగణములను ఆహ్వానించెను. దేవతలు గర్విష్ఠులై, శివుడు తమ తోడ్పాటు లేక నేమియును చేయజాలడనియును, తాము లేక శివుడు రాక్షసులను సంహరింప జాలడనియును విఱ్ఱవీగుచుండిరి. వీరికి జ్ఞానము కలిగించుటకై తానొక్కడే మువ్వురు రాక్షసులను సంహరించి తాండవము జేసెను. దానిని త్రిపురసంహార తాండవమందురు.

9. భుజంగ నృత్యము :- ఒకపుడు గరుడునకు సర్పములకు వైరము చెలరేగెను. అంతట వారు అమృతము నెవరు తెత్తురో, వారికి రెండవవారు దాస్యమొనరింప నొడంబడికను గావించుకొనిరి. అపుడు గరుడుడు అమృతమును దెచ్చెను. ఇది తెలిసి సర్పములు తాము గరుడునకు దాస్యము చేయనొల్లక, శివుని శరణుజొచ్చిరి. అపుడు శివుడు సర్పములను తనకు ఆభరణములుగ ధరించెను. అంతట గరుడుడు శివునికడకు వెళ్ళి, తమ యొడంబడికను దెల్ప, శివుడు తాను సర్పములకు శరణు యొసంగితినని గరుడునికి దెలిపి భుజంగ నృత్యము గావించి సర్పములను రక్షించెను.

9. "దారుకావనము"నందు ఋషులు తమ పత్నులతో సుఖ జీవితము గడుపుచుండిరి. వారికి నవీనమైన గృహస్థజీవితమం దాసక్తితో శివుని విస్మరించిరి. శివుడు దారుకా వనమునకు వెళ్ళి వారి భార్యల నందఱ నాకర్షించెను. ఋషులు తమ తమ భార్యలను గానక, వారి నాకర్షించిన వానిని శపించిరి. అవుడు శివుడు లింగరూపమున పాతాళ లోకమున నుండెను. అంతట ఋషులు తమ భార్యల నాకర్షించినది శివుడే యని తెలిసికొని, తమ తప్పిదమునకు మిక్కిలి పరితాపమును బొందిరి. అంతట శివుడు తన కార్యము ఫలించినదని బ్రహ్మ, విష్ణు దేవగణముల యెదుట భిక్షుక రూపమున నాట్య మొనర్చెను. దీనిని భిక్షాటన నృత్యము అని అందురు.

10. అజప జపనాట్యము - ఒకసారి దేవేంద్రుని ఇష్టదైవ మగు భగవానుడు "అజప నటనము"ను గావించెను. "సోహం" "హంస" శబ్దముల కనుగుణముగ శివుడీ నృత్యమును జేయుచు, శంఖ మును పూరించుచు, డమరుకమును మోగించుచు, "తత్త్వమసి" అను దానికి యనుగుణముగ "అజప జపనటనము"ను గావించెను.

దక్షిణ భారత దేవాలయములలో పైన పేర్కొనిన దశవిధ నృత్యముల శిల్పములను చూడగలుగుదుము. ఈ నాట్యముల ననుస రించి యే ప్రజలు తమ నాట్యరీతుల మలచుకొని నాట్యముల జేయు చున్నారు. భరతుని నాట్యశాస్త్రమునకు నివియే మూలాధారములు.

## అష్టావరణములు

"గురుర్లింగం జంగమశ్చ తీర్థం చైవ ప్రసాదకః।

భస్మ రుద్రాక్ష మంత్రాశ్చ త్యష్టావరణ సంజ్ఞకాః"।

సంసార సంబంధమగు దోషజాలముల భక్తుల దరిజేరకుండ పారద్రోలు నవి కాన నివి ఆవరణ సంజ్ఞచేత పిలువబడినవి.

"1) గురువు 2) లింగము 3) జంగము 4) భస్మము 5) రుద్రా క్షలు 6) పంచాక్షరీ మంత్రము 7) తీర్థము 8) ప్రసాదము" ఇవి అష్టావరణములు.

1. గురువు :- గురుడు - శివుడు - మంత్రము అనునవి రూప భేదములుగ గ్రహింపవలయును, కాని వస్తుభేద మేంతమాత్రము లేదు. గురువు శివరూపుడై, నిగమాగమ వేద్యుడై, షట్థ్సల - షడ్లింగ - లింగాంగ వివేకము గలవాడై, దీక్షాదికృత్య వివేకుడై యుండును.

అందుచేకే శివభక్తులు "సదాశివ సమారంభాం - శ్రీకంఠా రాధ్య మధ్యమాం - అస్మదాచార్య పర్యంతాం - వందే గురు పరం పరాం" అని గురుపరంపరను శ్లాఘించి, స్మరింతురు." అన్ని మతముల వారును "గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుః సాక్షా త్పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః" అని గురుని స్తుతింతురు.

"చంద్రజ్ఞానము" నందు "క్రియాపాదము"లోని ద్వితీయ పట లములో గురు గృహస్థ ఏవస్యాత్ - సదా విద్యా విర్యవేత్ - వాన ప్రస్థయతీ నాంతు - గురుత్వం నిష్ఫలం భవేత్" అని యున్నది. గురువు గృహస్థుడుగనే యుండవలయుననియును, ఎవ్వడైన ఒకప్పుడు కలిగిన విరాగమువలన సన్యాసమును స్వీకరింపరాదనియును, వానప్రస్థ మరియు సన్యాసులకు గురుత్వాధి కారము నిష్ప్రయోజన మనియును పైన చెప్పిన శివాగమములయొక్క యభిమతము,

శివదీక్షతో గూడి గృహస్థాశ్రమమునందు కర్మ - భక్తి - జ్ఞాన ముల సముచ్చయ ముండుటచేత శివయోగి అగు గురువు "అత్యాశ్రమి" అనబడును.

సంధ్యావందనాది నిత్యకర్మలు - గంధపత్ర పుష్పాది సమర్పణ రూపమైన భక్తియు - వేదశాస్త్ర విచారాత్మకమైన విజ్ఞానము శివ యోగియైన గురువునకు అత్యావశ్యకములు అగుటచే ఆశ్రమాంతర

ముల నాశ్రయించు నవసరము లేదు. అంతియేగాక శిష్యులగు భక్తులు సమర్పించు వస్తువును గ్రహించు యోగ్యత గృహస్థుడైన గురువునకే యొప్పును. సన్యాసికి ప్రతిగ్రహము నిషిద్ధము. "ఏతాని గురవేదద్యాత్ యదిచ్ఛేత్ పరమాం గతిం" అను వాక్యానుసారము భక్తితో భక్తులు గురువునకు ఏవస్తువు సమర్పించినను, అట్టి భక్తునకు శివానుగ్రహమువలన నేర్పడు మోక్షము (పరమగతి) లభించును. భగవద్గీతలో "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి" అని భక్తితో సమర్పించిన వస్తుప్రాధాన్యము తెలుపబడినది.

"సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం" "ఆచార్యవాన్ పురుషో వేద" అను శ్రుతి వాక్యములచే; "ఉపదేక్ష్యంతి తే జ్ఞానం... జ్ఞానిన స్తత్త్వ దర్శినః" అను స్మృతి వచనములచే సుజ్ఞానులైన, నానా సంప్రదాయములను దెలిసిన, శివయోగాభ్యాసము జేసిన, మహాపురుషుడు గురువు అని తెలియుచున్నది. ఇట్టి శివయోగులగు గురువులు మూడు విధములుగ నుందురు.

1. క్రియాయోగులు .- శిరస్సు, హస్తములు, వాక్కు మొదలగు నవయవములతో, నమస్కారాది సదాచారములతో పరమేశ్వరుని సేవించుచు, తన యైశ్వర్యముతో శివభక్తుల నుపచరించుచు, నిత్యము శివపూజ చేయువారు "క్రియాయోగులు" అని పిలువబడుదురు.

2. తపోయోగులు :- క్రియాయోగముతో గూడ ప్రతినిత్యము త్రికాలములందు శివుని బూజించుచు, మితాహారాదులచే (ప్రసాద నియమము) ఇంద్రియములను స్వాధీనము జేసికొని, పరద్రోహము మొదలగు దోషములుగల తమోగుణము లేనివారై, ఏకభుక్త-నక్త వ్రతాది నియమముల నవలంబించి, యదృచ్ఛాలాభ సంతుష్టులై, పంచాక్షరీమంత్ర రసనులై యుండువారు "తపోయోగులు".

3. జపయోగులు: క్రియా యోగము తోడను మరియు తపో యోగములతోడను, నెల్లకాలము పరిశుద్ధి కలవారై, పరస్త్రీ గమనాది నిషిద్ధ కర్మలను విసర్జించి, పంచాక్షరీ మంత్రము నెల్లకాలము జపించుచు శాంతగుణములు కలవారు జపయోగులు.

శాంతమూర్తియగు శంకరుని స్వరూపమును స్ఫురింపజేయు

భస్మరుద్రాక్షలను దాల్చి సుఖాసీనులై, స్వేష్టలింగమును కరతల - మందుంచుకొని అవలోకించుచు, పంచాక్షరీ మంత్రరాజమును జపించు చుండెడివారు శివయోగులలో శ్రేష్ఠులు.

వేమన గురువును గూర్చి తెలుపుచు "అన్ని దానములకన్న నన్నదానమే గొప్ప, కన్నతల్లికంటె ఘనము లేదు; ఎన్న గురునికంటె ఎక్కువ లేదయా," అని గురువు సమస్తములో మిన్నయని తెలిపెను.

వేమన గురు గుణముల వర్ణించుచు, మృగమదంబు చూడ మీద నల్లగనుండు, బరిఢవిల్లు దాని పరిమళంబు; గురువులైన వారిగుణము లీలాగురా;" అని వివరించెను.

"గురుః సద్గుణవాన్ ప్రాజ్ఞః పరమానంద భాసకః
తత్త్వ విచ్ఛివ సంయుక్తో ముక్తిమార్గావ బోధకః"

"జితేంద్రియము, పరోపకారము, శాంతస్వభావము, మొదలగు సద్గుణములు కలిగి; శైవ వాఙ్మయమును దాగుగ గుర్తెంటిగి, శివానందమును భక్తులకు విశదీకరించి, శ్రుతి స్మృతిగీయది ప్రతిపాదిత పరమేశ్వర లక్షణమును కనుగొని. పరమేశ్వరునియందు భక్తిగలిగి, అంగత్రయము నందు లింగత్రయమును పాసించి, ముక్తిమార్గమును సరసముగ చూపెట్టువాడు నిజమైనగురు.

"గు - కారము - అజ్ఞానాంధకారమును బోగొట్టునదనియును తెలుపబడుచున్నది.

శాంతో దాంత వదాన్య సత్యవచనో - దక్షః కృపాళుః శుచిః

సర్వజ్ఞః శివతంత్ర సిద్ధి రనఘోధీరో మనీషి స్మృతః; శిష్యప్రోక్తన కర్మ దోషపహారణః సద్భుక్తి ముక్తిప్రదో; ధ్యేయః సర్వగుణో త్తమో గురు వరః" అని గురువును గుర్తెఱుంగపలయును.

"ఆగమార్గాను సంధాతలై, రాగద్వేష వివర్జితులై, ధ్యాన యోగ సమాయుక్తులై, పార్వతిని తల్లిగ, మహేశ్వరుని తండ్రిగ, శివభక్తులను బాంధవులుగ చూచెడి గురువులు భూర్భువస్సువర్లోకము" లనబడు త్రిలోకములకు గురువులు"

2) లింగము - గురుడు దీక్షచే నిచ్చిన లింగముకంటె మరొక దైవము లేదని నిశ్చయించి, తద్ధర్మముల నాచరించుట "లింగాచారము" అట్టి లింగము "నాదబిందుకళా" రూపమై, శివశక్త్యాత్మకమై, శివభక్త పూజ ధ్యానాత్మకమై యుండును.

బమ్మెర పోతనామాత్యుడు "చేతులారంగ శివుని పూజింపు" మని నుడివెను.

"సూతసంహిత"లో శివ ఏవ స్వయం లింగం - లింగం గమక మేవహి, శివేన గమ్యతే సర్వం" అని లింగము మరియు శివుల కభేదము తెలుపబడినది.

"బ్రహ్మోపేంద్ర సురేంద్ర పూజిత పదో బ్రహ్మాండ పూర్ణోదరః; బ్రహ్మాది ప్రతిబంధ మోక్షణపరో బ్రహ్మస్వరూపోఽక్షయః; సాదృశ్యాధిక జన్మమృత్యు రహితః సద్భుక్తి ముక్తిప్రదః పార్వత్యా సహితః శివః" అనునట్లు శివుడు లింగరూపములో శివంకరుడగుచున్నాడు.

"శివపురాణ" మందలి "విద్యేశ్వర సంహిత"లో 11-వ అధ్యాయమున "శివలింగము శివస్వరూపమనియును, శివలింగపీఠము శక్తి స్వరూపమనియును" కలదు.

"లీయతే గమ్యతే యత్ర యేన సర్వం చరాచరం; తదేతత్ లింగమిత్యాహుః" అనగ చరాచరమగు సర్వము ఎచటనుండి వచ్చుచున్నదో, ఎందు లీనమగుచున్నదో, అదియే లింగము. శ్రుతులు "సర్వలింగగ్గ్ స్థాపయతి పాణిమంత్రం పవిత్రం"- "నమో బ్రహ్మణే ధారణం మే అస్త్వనిరాకరణం ధారయితా భూయాసం" అని లింగ ధారమును ప్రోత్సహించుచున్నవి.

యథావాక్కుల అన్నమారాధ్యులు "అమరన్ భక్తగణాత్మ మధ్యమము లింగావాస, మాలింగ మధ్యమమును బద్మభవాండ భాండ నియంబై యుండుటన్......తల్లింగ తృప్తి మహత్త్వంబున నీ సమస్తమును దృప్తింబొందు, సర్వేశ్వరా!" అని లింగతృప్తియే సర్వప్రపంచ తృప్తిగ బేర్కొనెను.

కాన లింగము నెవరు కరస్థముగ జేసి పూజచేయుదురో, లింగము నెవరు ధరింతురో వా శివశరణులు లింగస్వరూపమైనవారుగ శైవాగమములు పేర్కొనినవి.

౩) జంగమః:- మాహేశ్వరరూపుడై, చరుడై, లింగధారియైన, మహాభక్తుడే జంగముడు. శివునియందు అనగ లింగమునందు గురుచరేశ్వరారాధనను ప్రతినిత్యము శైవులు చేయుదురు. మాహేశ్వరుడు లభ్యమైనపుడు ప్రత్యేకముగ జంగమారాధనచేయుట శైవుల కొరకు ముఖ్యవిధి. శివభక్తులెల్లరు సర్వోత్తములు. వారికి నేను భృత్యుడనను భావనతో భృత్యాచారము జంగమహేశ్వరునికి జరుపవలయును.

యథావాక్కుల అన్నమాచార్యులు "సాక్షాద్భక్తులం జూచినం బరమార్థంబుగ బాయుదే సకల పాపంబెల్ల" అనియును; "కని సద్భక్తుల కంటెనంత హృత్ప్రణామంబు సేసిన మాత్రం జెడు సర్వదోషములు, తచ్ఛీ పాదములు మెట్టి మ్రొక్కిన సర్వాంగ సమగ్ర శుద్ధియగు" అనియును లింగారాధన జంగమార్చనములలోలిన్ భక్తికం

గంబు పాలినాంగ వ్యాప్తియునై స్ఫురించునది తత్త్వార్థంబగున్" అని యును, "లింగార్చనకంటె జంగమము సౌందర్యంబుతో గొల్చు టుత్తమ భక్తిస్థితి, లింగ జంగమముల సామ్యంబుగా జేత మధ్యమ భక్తిస్థితి. లింగపూజ నధికుండై జంగమో పాసనాత్ముడై యుండుట భక్తియందది కనిష్ఠత్వంబు సర్వేశ్వరా!" అనియును జంగమార్చన ప్రాధాన్యతను దెలిపెను.

స్వశరీర మహాకృతముని భావించి, లింగ-జంగమ ఆరాధనగావించుట; శివపూజలేక భుజింపకుండుట, శివధర్మ మహిమ శ్రవణము, నివేదిత పదార్థమును విడువకుండ భుజించుట పంచాచారములలో సదాచారము.

శైవగణార్చనలో సైతము, సదాచార రీత్యా, గురుచరేశ్వరుల నారాధించుచు, పురాతన నవీన భక్తమాహేశ్వరుల పూజించుట విహితము. కాన, జంగమ పూజ ముఖ్యము.

4) భస్మము :- గోమయము (ఆవుపేడ) క్రిందపడకుండ గ్రహించి ముద్దలుగ జేసి;- ఎండలో పెట్టి; దహించి, శోధించి, " 1, గ్రహణము 2, కల్పనము 3) శోషణము 4) దహనము 5) శోధనము" అనునవి పంచసోపానములచే. భస్మమును సిద్ధము జేయవలయును.

"కపిలాయాః శకృత్ శస్త్రం గృహీతం గగనే పతత్, సక్లిన్నం నాతి కఠినం నదుర్గంధి నచోషితం, ఉపర్యధః పరిత్యజ్య గృహ్ణీయాత్ పతితం యది. పిండీకృత్య శివాగ్నౌ తత్ క్షిపేన్మూలమంత్రతః అపక్వ మతిపక్వంచ సంత్యాజ్యం భసితం సితం, ఆదాయ వాసనా లోజ్జ్వ భస్మాధారే వినిక్షిపేత్, అని విభూతిని సిద్ధము జేయు ప్రక్రియ తెలుపడినది

అట్టి భస్మధారణను గూర్చి "ఆత్మన్యగ్నిం సమారోప్య, యాతే అగ్నేతి మంత్రతః భస్మాదాయాగ్నిరిత్యాద్యైః; విమృజ్యాంగాని

సంస్పృశేత్" అను బృహజ్జాబాలోపనిషత్తు వాయవీయ సంహిత ప్రమాణానుసారము; "యాతే అగ్నే యజ్ఞియా తనూః" అను మంత్రముతో తనయందగ్ని నారోపించుకొని, "ఓం అగ్నిరితి భస్మ - వాయురితి భస్మ - జలమితిభస్మ - స్థలమితిభస్మ - వ్యోమేతిభస్మ - సర్వాగ్ం హవా ఇదం భస్మ - మన ఏతాని చక్షూంషి భస్మాని" అను 'కాలాగ్నిరుద్రోపనిషద్"మంత్రముతో భస్మధారణము చేయవలయును.

అరచేతియందు విభూతినుంచుకొని "మానస్తోకే తనయే, మాన ఆయుషి, మానోగోషు, మానో అశ్వేషు రీరిషః, వీరాన్మానో, రుద్రభామితో వధీర్హవిష్మంతో నమసా విధేమతే" అను మంత్రముచే మర్దించి, శరీరమందలి క్రింద సూచించిన భాగములలో భస్మమును ధరింపవలయును.

"1. లలాటే బ్రహ్మావిజ్ఞేయం; 2, హృదయే హవ్యవాహనః; 3, నాభౌస్కంధో; 4. గళేపూషా, 5. రుద్రోదక్షిణ బాహుకే, 9. ఆదిత్యోబాహు మధ్యేచ, 7, శశీచమణిబంధకే, 8. వామదేవో వామ బాహకా, 9, బాహుమధ్యే ప్రభంజనః, 10. మణిబంధేచ వరవః, 11. పృష్ఠదేశే హరః స్మృతః, 12. శంభుః కకుది సంప్రోక్తః, 13. పరమాత్మా శిరః స్మృతః" అని భస్మధారణ చేయవలసిన స్థావములు చెప్పబడినవి.

ఇట్టి విభూతి ధారణమువలన కండరరోగ - కీళ్ళరోగముల నిరోధకశక్తి కూడ భస్మమందుకలదు. కంటిపై ప్రతి దినము భస్మమును ధరించినచో కళ్ళకు రోగములు రావు.

భూతప్రేత పిశాచ యక్ష దనుజారిష్టాదిసంహారిణీ, దారిద్ర్య ప్రతివక్ష రోగభయ దుష్కర్మౌఘనిర్మూలినీ, సంపద్వృద్ధి శుభౌఘ పుణ్యవిభవాప్త్యైశ్వర్య సంధాయినీ, భూతిః సర్వజగత్పవిత్ర కరణీ," అని భస్మముయొక్క మాహాత్మ్యము తెలుపబడుచున్నది.

"భూవైశ్య నవ్రమది తవ్యం" అని విభూతి మైశ్వర్య వాదము గాన యేమరక ధరింపవలయునని విదితమగుచున్నది.

అన్నిటిలో "విద్యాశక్తి" చాలగొప్పది. అట్టి విద్యాశక్తి త్రిగుణములన్, త్రిగుణములు విద్యాశక్తిని పరస్పర మాశ్రయించి యుండును. "ఆవు గుణత్రయ రూపమైనది. గోమయము విద్యాశక్తి. గోమూత్రము ఉపనిషత్తు" అని చెప్పబడుచున్నది. "కావున, నట్టి గోమయ - గోమూత్రములచే సిద్ధము చేయబడిన భస్మమును సంపాదింపవలయును.

గృహస్థులు మూడు సంధ్యలయందును భస్మమును నీళ్ళతో గల్పియున్, పర్వకాలములందు నీళ్ళతో గల్పక, విభూతిని ధరింపవలయును. స్త్రీలు మరియు యతులు భస్మమును నీళ్ళతో గల్పరాదు. "ధార్యం భస్మ త్రిసంధ్యంతు, గృహిణాజల సంయుతం, పర్వకాలే భవేత్ స్త్రీణాం యతీనాం జలవర్జితం".

"మధ్యమానామికాంగుళులతో అను లోమ విలోమముగ పై రేఖను క్రింది రేఖను, ఆ రెండు రేఖల నడుమ అంగుష్ఠముతో విలోమముగ మధ్యరేఖను ధరింపవలయు. తర్జని తగులరాదు. "నేత్రయుగ్మ ప్రమాణేన త్రిపుండ్రం ధారయేత్" అనుటచేత ఆ రేఖలు కన్నుల వఱకే యుండవలయును.

ఊర్ధ్వ పుండ్రం భవేత్సామ, మధ్య పుండ్రం యజూంషిచ' అధః పుండ్రం ఋచస్సాక్షాత్, తస్మాత్పుండ్రం త్రియాయుషం" "పై రేఖ సామవేదము, మధ్యరేఖ యజుర్వేదము, క్రిందిరేఖ ఋగ్వేదము" అని గ్రహింపవలయును

ప్రతివస్తువుపై పవిత్రతకొఱకు భస్మము చల్లి స్వీకరించుట "శివాచారము"

"అహితాగ్ను" లగు వారికి సర్వ భస్మముండును. అహితాగ్నులు కానివారికి నిత్యోపాస నాన్యతరము బ్రాహ్మణ భస్మముండును. కాన భస్మధారణము ముఖ్యమైనది.

5. రుద్రాక్ష :- రుద్రాక్షల నెల్లపుడును ధరింపవలయును. రుద్రాక్షలు శరీర పవిత్రతను గాపాడుచుండును.

శివభక్తుడు ఏబదినాలుగుకంటె తక్కువగాక యుండునట్లు, నూట యెనిమిది, వెయ్యి మున్నగు విధముగ అనగ సహస్రాధిక్యముగ రుద్రాక్ష ధారణను చేయుటుచితము. "రుద్రాక్ష నామోచ్ఛారణేన దశ శత గోదానఫలితం భవతి" అను వాక్యముచేతను రుద్రాక్ష రత్నము కానప్పటికిని రత్నధారణము వలన జరుగు శుభఫలితములు దీని వలన గూడ నొనగూడునని తెలియనగును. రుద్రాక్షల ధరించుటచే" రక్తపు పోటు- గుండెపోటు- శ్వాసకోశ వ్యాధులు వంటి రోగములు రాకుండునటుల రోగనిరోధశక్తి పెరుగును.

త్రిపురాసుర సంహారకాలమున శివుడు తెరచిన కన్నులనుండి జలబిందువులుపడి యవియే రుద్రాక్షలైనవి. ఆర్వేదమునందు సన్నిపాతాది రోగములందు తేనెలో రుద్రాక్షను రంగరించి యిచ్చుట గమనీయము.

"రుద్రాక్షోద్భవ మేదినీ పతిత ముద్భావ్య ప్రభావః స్థితౌ, యో రుద్రాక్ష తదుద్భవ విదితః సర్వోపకా రక్షకః, స్పర్శ్నే తౌ జప ధారణ స్మృతిశ్రుతా మత్యంత సౌఖ్య ప్రదం, తద్రుద్రాక్ష మనంత పుణ్యఫలదం" అని రుద్రాక్ష ప్రాధాన్యత తెలుపడుచున్నది.

6 పంచాక్షరీమంత్రము :- "ఓంకార వదనా దేవీ, వా, య, కార భుజద్వయా, శి, కార దేహమధ్యాచ, న, మ, కార పదద్వయీ ॥ పంచాక్షరి (నమశ్శివాయ) వర్ణింపబడినది.

పంచాక్షరీ స్వరూపము :- "శివపురాణం" వాయవీయ సంహితలో (ఉత్తరభాగము) - అ-14) "తప్తచామీ కరప్రఖ్యా-పీనోన్నత పయోధరా, చతుర్భుజా త్రినయనా - బాలేందుకృతశేఖరా. పద్మోత్పల కరాసౌమ్యా - వరదాభయ పాణికా, సర్వలక్షణ సంపన్నా - సర్వాభరణ భూషితా, సితపద్మాసనాసీనా - నీలకుంచిత మూర్ధజా." అని వర్ణింపబడినది. తపింపబడిన బంగారపు వర్ణముకలిగి, బలిష్ఠములు ఉన్నతములునగు వక్షోజలములతోడ, నాలుగు చేతులతోడ మూడు కన్నులతోడ నిశాజిల్లినట్టిదియు, చంద్రరేఖను శిరోభూషణముగ ధరించునదియు, కమలము - కలువ - వరదముద్ర- అభయముద్రలను హస్తములందు దాల్చినదియు, సర్వశుభలక్షణములతోడను ఆభరణములన్నిటితోడను, తెల్లనికమలములందు ఆసీనయై నల్లని ముంగురులతో కూడిన వెంట్రుకలు కలదియు, దివ్యరూపిణియైన శివశక్తి పంచాక్షరీ దేవత.

"నమః శివాయ" అనగ శివుని కొరకు నమస్కారము అనియును "న-మః-శివాయ" అనగ సమస్తము శివుని కొరకేగాని నాకొరకు కాదు. అనియును, "నమః జీవుడు, శివ- శివుడు, ఆయ=ఐకమము;" అనగ "శివజీవైక్యము". దీనినే "లింగాంగ సామరస్యము" మరియు "లింగైక్యము" అని యందురు.

పంచాక్షరి - గాయత్రి - ప్రథమ సూత్రములందలి శివ - భర్గ బ్రహ్మపదములు శివాన్వయములుగా గమనింపదగును.

పంచాక్షరీ వ్యవస్థను లింగాంగ భాగములలో నీ క్రింది విధముగ తెలుపబడినది.

1. ఓం :- "శుద్ధస్ఫటికము"- అవ్యక్త దాలక - శివమంత్రి - శాంత్యోత్తర - శివ - చిచ్ఛక్తి,

2. న :- పసుపు పచ్చన - తత్పురుష ముఖము - తూర్పు-ఊర్ధ్వ పట్టిక - తత్త్వ - శాంత్యతీత - సదాశివ పరా.

3. మః- నలుపు (నీలిరంగు) అఘోరముఖము - దక్షిణము - అబ్జము
కళ - శాంతి - అమూర్తి - ఆది.

4. శిః- ముత్యపురంగు - ఈశాన్యముఖము - ఊర్ధ్వము - కంఠము -
వర్ణా - విద్యామూర్తి - ఇచ్ఛా.

5. వాః- తెలుపు - సద్యోజాత ముఖము - పడమర - కంజము -
పద - ప్రతిష్ఠ - కర్తృ - జ్ఞాన.

6. యః- ఎఱుపు - వామదేవముఖము - ఉత్తరము - అధఃపట్టిక -
భువన - నివృత్తి - కర్మ - క్రియా.

ఐదు విధములుగ వ్యావృత్త్వ లక్షణ లక్షితములగు నివృత్త్యాది కళలందు తత్త్వాధ్వాదుల వ్యాపకత పై విధముగ సూచింపబడినది.

యథా వాక్కుల అన్నమారాధ్యులవారు "శివవాక్య స్ఫురితాక్షరద్వయ సత్కృజ్జిహ్వా ప్రదేశాత్ముడై, భవదుఃఖాంబుధి దాటుసన్న మఱి దత్పంచాక్షరీ మంత్ర ముత్సవలీలం గడు శుద్ధుడై జపము వాంఛం జేయు భాస్వద్గుణార్ణవ సౌభాగ్యము మాన మెవ్వరికి గానవచ్చు సర్వేశ్వరా! "అనియును" భవదీయానన పంచకంబువలనం బంచాక్షర శ్రేణి యుద్భవమై తత్పద వర్ణపద్ధతుల సంభవించ భూతంబు లుద్భవనంబై యఖిలంబు బెట్టెను. లసత్పంచాక్షరీ మంత్ర మీ భువనాండంబుల దల్లియై శుభములం బొందించు సర్వేశ్వరా! అనియును, క్రమ సంయుక్తి మనంబు బుద్ధియు నహంకారంబు జిత్తంబు నా యుమలాంతః కరణంబు నక్షర చతుష్కావ్యాప్తిగా దీర్చి పంచము వర్ణంబుగ నాత్మగూర్చి కడు వాంఛన్ యోగి పంచాక్షరీ మహామంత్రముతోడ నైక్యపదవిన్ శోభిల్లు సర్వేశ్వరా! అనియును పంచాక్షరీ మాహాత్మమును వర్ణించెను.

పంచాక్షరీమంత్రము వేదమంత్రము. ఋగ్యజుస్సామములను వేదత్రయములోని యజుర్వేదమందలి "నమస్సోమాయ" అను అను అనువాకములో "ఓం నమశ్శివాయ" అను మంత్రము గుప్తము చేయబడి నది, అందులోనే "నమస్తారాయ" అని తారకమంత్రముగ వర్ణింప బడినది. కావున సప్తకోటి మంత్రములలో మహామంత్రముగ, తారక మంత్రముగ ప్రసిద్ధిగాంచినదీ మంత్రరాజము.

7. తీర్థము - తీర్థము పవిత్రగంగా జలము. ఎవరు గంగ, గంగ అని అందురో. వారుముక్తి నొందుదురు. "గంగా గంగాగేతి యో బ్రూయాత్ యోజనా నాంశతైరపి ముచ్యతే సర్వపాపేభ్యః శంభు లోకం స గచ్ఛతి" అని గంగను సర్వతీర్థములలో నుత్తమమైన దానినిగ తెలుపుచున్నారు. అటువంటి సర్వతీర్థములలో "రమణన్ భక్త సమగ్రదర్శనము తీర్థశ్రేణి, తద్ఘోష్ఠి తీర్థము, తద్దివ్య దయాలోకనము తీర్థం బెన్నగా నిట్టి జంగమ తీర్థాంబుధి నోలలాడక" కొందరు జనులు వివేకభ్రష్టులైపోయి లోకములో తీర్థములంచు నేఱులు సొచ్చుచున్నా రని "అన్నమారాధ్యులవారు సెలవిచ్చిరి. దానికి కారణము" కమ నీయంబగు సర్వతీర్థములు లింగంబున్నచో మూర్తిమంతములై యొప్పుచు నుండు, లింగమును దాత్పర్యంబుతో భక్త గాత్రములం దెప్పుడు నుండు, గాన మహిలో దత్త్వార్థమూహింప దీర్థములం దెల్లను దివ్యతీర్థము భవద్భక్తుండు" అని తెలుపుచు, యథావాక్కుల అన్నమారాధ్యులు అట్టి దివ్యతీర్థ స్వరూపుడగు భక్త పాదతీర్థము అన్నింటికంటె గొప్ప దనియును నుడివెను. "పలుతీర్థంబుల గుంకకంటె మహిలో భక్తాంఘ్రి పానీయముల్ తలమీదం జిలికించుకొన్న శుచితీర్థం బాడ భారంబు తత్ఫలమత్యల్పము భక్తపాద యుగళాంభస్స్పర్శ నిర్భరమై యులరున్ శాశ్వత భుక్తి ముక్తి ఫలదంబై యుండు సర్వేశ్వరా" అని భక్తాంఘ్రి పానీయము అనగా భక్త పాదతీర్థముయొక్క గొప్పతనము వివరింప బడినది. అట్లే సానందారాధ్యులవారు తమ "నటరాజ శతకము"లో

మాహేశ్వరాధిక మహిత పాదోదక పానంబుచే శుద్ధిం బడయువల యునని" వివరించిరి. లలితగణాచార భరితుడై, భవ్యసదాచార భాగ్యుడై, వరమలింగాచార లక్షుడై, సత్యము పరమేశ్వరుడగు శివుని అర్చించి, ఆరాధించి, పవిత్రతీర్థములో నభిషేకించి, ఆఉదక మును శిరస్సున జల్లుకొని, శివలింగపీఠ భాగమున శివుని పాదము లున్నటుల భావించి, కొంచెము భస్మము + జలములను శివలింగముపై నుంచి, ఆ తీర్థమును "అకాలమృత్యుహరణం సర్వవ్యాధి నివారణం, సర్వ పాపక్షయ కరం లింగ పాదోదకం శుభం" అని శివలింగ పాదతీర్థమును త్రాగవలయును.

గంగా వేగవతీ ప్రభాకర సుతా గోదావరీ నర్మదా కృష్ణా పుష్కర ముఖ్య పుణ్యసరితో బ్రహ్మాండ మధ్యే స్థితాః, యాస్త త్స్నాన సహస్ర కోటి ఫలదం ముక్తిప్రదం భవ్యదం, శంభోః పాదజలం చరస్య చగుగోః" శివ - శివభక్త తీర్థములు బ్రహ్మాండములో నున్న సమస్త తీర్థస్నాన సహస్రకోటి ఫలితములనిచ్చును.

"చరణం పవిత్రం వితతం పురాణం" అను శ్రుత్యనుసారము శివ చరణము- గురుచరణము- జంగముడగు భక్త మాహేశ్వర చరణము పరమ పవిత్రమైనది. అట్టి గురుచరేశ్వరుల పాదతీర్థము మిక్కిలి పవిత్రము.

ప్రసాదము :- భక్త స్థలములో దివ్యస్వరూపమై, మహేశ్వర స్థలములో మాన్యమై తనరారి, పరము "ప్రసాద" స్థలము లో లింగము భవ్యమై యొప్పును. ఈ విధముగ షట్ స్థలములలో ప్రసాదస్థలము ముఖ్యమైనది. అటులనే భస్మరుద్రాక్ష భరితుడైన శివశరణుడు "హర నివేదిత నైవేద్యమును అందవలయును.

శివునకు అనగ లింగమునకు నివేదించిన అన్నము "ప్రసాద మగును. నివేదన చేసిన నీరు తీర్థమగును. "తీర్థప్రసాదములు సర్వపాప

హారములు. లింగధారణ చేసుకొనని వారికి తీర్థప్రసాదములు ఎప్పుడో గాని లభింపనేరవు. ఇష్టలింగధారులైన వారికి ప్రతినిత్యము తీర్థ ప్రసాదములకు లోటు లేదు. కాన ప్రతినిత్యము శివపూజచేసి తీర్థ ప్రసాదముల స్వీకరించు శైవులకు పాపమంటనేరదు.

ఈ పైన పేర్కొనబడిన గురువు మొదలగు అష్టావరణములు ముముక్షువులకు తరణోపాయములు.

## శివపారమ్యము

"అసితగిరి సమం స్యాత్ కజ్జలం సింధుపాత్రే
సురతరు వరశాఖా లేఖనీ పత్రముర్వీ
యది లిఖతి గృహీత్వా శారదా సర్వకాలం
తదపి తవ గుణానాం ఈశ! పారం నయాతి॥

మహిమ్నస్తోత్రము — పుష్పదంతుడు)

సర్వకాల సర్వావస్థలయందును, సరస్వతీదేవి భూమిని (కాగితము) పత్రముగను కల్పతరుశాఖను లేఖిని (కలము) గను చేసుకొని సముద్రమును సిరాబుడ్డిగ చేసి శివునియొక్క గుణముల వ్రాయ ప్రారంభించినప్పటికిని శివుని యొక్క ఘనతను తెలుపుట కష్టము.

"జలజాత ప్రభవాండ బుద్బుదము లశ్రాంతంబునుం బుట్టచుం
గల యగ్రాగుడునుండు నీ పృథుల లింగస్ఫార గర్భాబ్ధిలో
వల దప్పబ్బుడ గర్భవాసులు హరిబ్రహ్మాది దేవాళియుం
గలదే వారికి నీమహత్త్వ మెఱుఁగంగా శక్తి? సర్వేశ్వరా!"

"సర్వేశ్వరశతకము - యథావాక్కుల" హరిబ్రహ్మాది దేవత లందరు లింగగర్భములలో నుందురు. అట్టి వారికి సైతము శివ మాహాత్మ్యము తెలియుట కష్టము అని అన్నమారాధ్యులు తెలిపిరి,

"యదాచర్మవదాకాశం వేష్టయిష్యంతి మానవాః, తదాశివమవిజ్ఞాయ దుఃఖస్యాంతో భవిష్యతి" "శ్వేతాశ్వతరోపనిషత్తు"

"ఆకాశమును చర్మమువలె చుట్టగల శక్తిగలవారు కూడ శివుని దెలియక, ఆనందమును బొందలేరు." అనగ శివుని గుర్తెరింగి పునరావృత్తి రహిత శాశ్వత శివపద ప్రాప్తిష్టులై, నిరతిశయ శివానందమును, అనుభవరూపముగనుండు నిర్వికార శాంతిని బడయవచ్చును. ఈ విషయము "జ్ఞాత్వా శివం శాంతి మత్యంతమేతి" అనుటచేత తెలియుచున్నది.

"యదా తమస్తన్న దివా న రాత్రిర్న సన్న చాసత్ శివ ఏవ కేవలః"

1) "నామరూప విభాగార్హ చేతనుడుగాని, 2) నామరూప విభాగార్హ జగముకాని లేనిసమయమున గాఢాంధకార సదృశమై ఇతరవస్తు పరిశాశాభావ సంపన్నమగు సూక్ష్మావస్థ యున్నపుడు (1) స్థూలసృష్టి- 2) స్థితి- 3) సూక్ష్మమైనలయ) ఇతరాపేక్ష లేనివాడై ఆత్మశక్త్యమృతాస్వాదన లోలుడైన శివుడొక్కడే విరాజిల్లుచున్నాడు.

హిరణ్మయత్వాది లక్షణములు గల హృదయపుండరీక వర్తియగు శివుడే, చతుర్థం మన్యంతే శివమద్వైతం "అనినటుల" బ్రహ్మ విష్ణు రుద్రాతీతుడగు నాలుగవ మహాపురుషుడగు నాలుగవ మహాపుషుడగు శివునిగ విబుధులు భావించుచున్నారు.

"శివ ఏకో ధ్యేయః శివంకరః సర్వ మన్యత్ పరిత్యజ్య".

—(ఆథర్వణము)

"సర్వమన్య త్పరిత్యజ్య శివ ఏవ శివంకరః
ధ్యేయ ఇత్యాహ పరమా శ్రుతిరాథర్వణేఖిలా."

(పరాశర పురాణము

శివు డొకడే ధ్యానింప దగినవాడు. శివేతరమును స్మరింపగూడదని భావము.

"అతో ముముక్షుభిస్సర్వై స్సాంబ స్సర్వేశ్వరాహ్వయ
పరతత్త్వం విశేషణ ధ్యేయ ఏవ సదా హృది."

—(మానవ పురాణము)

"మోక్షము కోరువారందరు సర్వేశ్వరుడగు సదాశివుని సర్వదా ధ్యానింపవలయును." అని సూచికము.

తంత్యక్త్వా తాదృశం, దేవం యస్సేవేతాన్య దేవతాం;
సహి భాగీరథీం త్యక్త్వా కాంక్షతే మృగ తృష్ణికామ్."

పద్మ పురాణము)

మహాదేవుని విడిచి, అన్యదేవతల నెవరు సేవింతురో వారుగంగా నదిని విడిచి మృగతృష్ణికయందు యాశచూపుచుండు వానితో సమానమని యర్థము.

కూర్మ పురాణములో "సర్వదేవతా వంద్యుడైన శివుని ఎవరు పూజింపరో వారుచేసెడు దాన - యజ్ఞ-తపసులు మొదలగునవన్నియును వ్యర్థములే అంతియేగాక వారి జీవితమును వృథాయగును." అని చెప్పబడినది.

"సహస్రం వర్తంతే జగతి విబుధాః క్షుద్రఫలదాః,
నమన్యే స్వప్నే వా తదను సరణం తత్కృత ఫలం,
హరి బ్రహ్మాదీనామపి నికట భాజామ సులభం,
చిరం యాచే శంభో! శివ! తవ పదాంభోజ భజనమ్ !!

(శంకరాచార్యులు)

"దేవతలు వేలకు వేలు కలరు. వారందరు నీచఫలముల మాత్రమే ఇచ్చెదరు. వారినందరిని స్వప్నమందైనను స్మరియింపను. హరిబ్రహ్మాదులకు సైతము ఏ మహాదేవుని సన్నిధికి అరుదెంచుట సాధ్యము

కాదో యుతనినే అనగా సదాశివునే సర్వదా ధ్యానింతును." అని శంకరులు చెప్పిరి. అంతేగాక "సాంబోనః కులదైవతం" అని నా కులదేవత సాంబశివుడని స్పష్టీకరించిరి. అంతేగాక "పశుపతే సాంబ త్వదీయా వయం" అని వారు మేమందరము సాంబసదాశివుని సంబంధికులగు శైవులుగ నొక్కి వక్కాణించిరి.

"విశ్వవిద్యలను శాసించువాడును, సర్వభూతములకు ప్రభువును, బ్రహ్మశబ్దముచే జెప్పబడుచున్న బ్రహ్మ విష్ణు మహేశ్వరులగు ముగ్గురు బ్రహ్మలకును అధిపతియును, వేదములకధిపతియును," బ్రహ్మ-ఓం-శివ" అను నామములు కలవాడు శివుడని వేదములలో తెలుపబడినది.

అప్పయ్య దీక్షితులవారు కూడ తమ "బ్రహ్మతర్క స్తవము" అను గ్రంథములో "బ్రహ్మ-ఓం-శివ" శబ్ద వాచ్యుడగు నాది దేవుతే శివుడ"ని పేర్కొనెను.

గాయత్రీ మంత్రమందు సహితము 'భర్గః' అనగ శివుడని అర్థము. సూర్యమండలాంతర్వర్తియు, సూర్యున కుపాస్యుడైన సవితృవరేణ్యుడు భర్గుడైన శివుడని భావము. అద్వైత మత స్థాపకులు శంకరాచార్యులవారును, విశిష్టాద్వైత మతస్థాపకులగు రామానుజాచార్యులవారును, భర్గః శబ్దము సకారాంతముగ నిర్ణయించి "రేతసీ భర్గ ఆలోకా' అను నిఘంటువు ఆధారముగ తేజః పరముగ నర్థము చెప్పిరి. మంత్రశాస్త్ర సంప్రదాయము ననుసరించి, ప్రతి మంత్రమునకును ఒక ధ్యాన శ్లోకముండును. అందు మంత్రమందు ప్రతిపాద్యమానమగు దేవతాస్వరూప వర్ణనముండును 'ముక్తావిద్రుమ' అను గాయత్రీ ధ్యాన శ్లోకములో 'ముక్తావిద్రుమ నీలహేమ ధవళచ్ఛాయ గలయైదు ముఖములు, ప్రతిముఖమునకు మూడు నేత్రములు. మకుటమున చంద్రరేఖ' అని చెప్పబడినవి. లోకములో 'అ' కారంత శబ్దముచే చెప్పదగిన "భర్గ" శబ్దవాచ్యుడగు శివునకే కన్పించుచున్నవి. అన్య దేవతలకు కావు.

ఈ విధముగ నాలోచించినచో పండితులు తేజః పరముగ గాక శివపరముగ నర్థము చెప్పినచో శివపారమ్యమును శైవమును అంగీకరింపవలసివచ్చును. కాన ప్రకాశమని భర్గశబ్దమునకు అర్థము తెలిపిరి.

బుద్ధయో వై ధియస్తా యోస్మాకం ప్రచోదయాత్ ఇత్యాహుః బ్రహ్మవాదినో హ ఇతి యోహ వా అస్మిన్నాదిత్యే నిహితస్తారకేక్షిణి చైష భర్గాఖ్యః భాభిర్గతిర్యస్య హీతిభర్గః భర్జయ తీతివైష భర్గ ఇతి రుద్రః'

(మైత్రాయణీ యోపనిషత్తు)

అని "భర్గ' అను పదము శివపరముగ చెప్పబడినది. అంతియె గాక త్రిపురాతపనోపనిషత్తునందు భర్గో దేవస్య ధీమహి త్యేవం వ్యాఖ్యాస్యామః..........భగవాన్పరమేశ్వరో భర్గో దేవః అని పై విషయము సమర్థింపబడినది. పురాణములలో నాదిత్యముఖ్య శ్శరీరం యచ్ఛివస్య పరమాత్మనః అని శివుని యష్టమూర్తులలో సూర్యుడొకరుగ తెల్పబడుచున్నది.

ఋగ్వేదములో "త్రిణ్యాంతం పూషాణం వయ మ సప్త వేదస మీశానం రాయ మీమహే"- 'రథీతమం కపర్దిన మీశాన రాధసే నమః'- 'రాయః సఖాయ మీమహే' అను వానిచే సూర్యమండలాంతర్వర్తి' ఈశానుడు - కపర్ది కుబేర సఖుడు'- అని వర్ణింపబడినది.

'మహోపనిషత్తు' నందు, సూర్యమండల ప్రభను, మండలాభిమానియగు సూర్యుని ప్రస్తావించి' సర్వో వై రుద్రః, నమో హిరణ్యబాహవే హిరణ్య కర్ణాయ హిరణ్యరూపాయ హిరణ్యపతయే అంబికాపతయే ఉమాపతయే నమో నమః' అని ఉపసంహారమునందు స్పష్టముగ ఆదిత్య మండలాంతర్వర్తి శివుడని ప్రతిపాదింపబడినది. కా గాయత్రి కూడ శివపారమ్యమును తెలుపును.

"యతో వా ఇ మాని భూతాని జాయంతే యేన
జాతాని జీవంతి యత్ప్రయం త్యభిసం విశంతి"

అని సర్వభూతములకు సృష్టిస్థితిలయములకు శివుడే కారణము అని చెప్పబడుచున్నది.

నిరంతరం శివోహం ఇతి శివోపాసనయా శిథిలిత పాశతయా అవగత పశుభావః శివఏవ భవతి అని నిరంతర శివోపాసనచేత పాశ విముక్తుడై జీవి శివసాయుజ్యము చెందును. జీవునకు ముక్తుడగు వరకు నుండెడిది. జనన మరణ రూపమైన సంసార బాధ ఈ జన్మములలో కలుగు వాధివ్యాధులను తొలగించుట కొరకు చరకాది మహర్షులు ప్రతిక్రియలు చూపియున్నారు. కాని సంసారబాధ తొలగి మోక్షము కావలయుననిన పాశుపతవ్రత రూపమైన పరమేశ్వరసేవ యొక్కటియే అని వ్రత మేత త్పాశుపతం తత్సమా చరే న్ముముక్షు రపునర్భవాయ అని చెప్పబడినది.

త్రియంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం
ఉర్వారుక మివ బంధనాన్మృత్యో ర్ముక్షీయ మామృతాత్।

అనగ ఇచ్ఛా-జ్ఞాన-క్రియులనెడు మూడు శక్తులు; గాయత్రి - త్రిష్టుప్_జగతి అను మూడు ఛందస్సులు, అగ్ని-చంద్ర-సూర్యమయ మవు మూడు నేత్రములు, ఋక్ యజు - స్సామ వేదములు మూడు కన్నులు, ప్రత్యక్ష - అనుమాన - శబ్దములు నేత్రత్రయము, భూత - భవిష్యత్ - వర్తమాన - మూడు కాలములు, చిత్త - అహంకార- బుద్ధులు మూడు కన్నులు; అ-ఉ-మ కారములు నేత్రత్రయముగ కల వానిని త్ర్యంబకునిగ వివిధ బుధులు నిర్వచించిరి. అటులనే తన ప్రభావముతో తత్త్వముల నన్నిటిని శుభమయముల జేయువాడు సుగంధి అని, మహాలక్ష్మి - ఐశ్వర్యము - మాయామోహ నివృత్తి-ప్రకృతి బంధవిమోచనము - దివ్యశక్తి అని పుష్టి శబ్దార్థములుగను నిర్వచనము చేయబడినది. అట్టి పుష్టిని పెంపొందించి ప్రాకృత దోషరాహిత్యమును సుగంధమును కలుగజేయు మృత్యుంజయుని పూజించి, భావించి ప్రార్థించుచున్నాము. అని భావము.